UESI
ANDHRA PRADESH

Rs. 12/- per copy

# విద్యార్థి జ్వాల

Vol. 29 - No.7

May 2023



## సువార్త కోసం సంఘటితమవుదాం

**ఎడిటోరియల్**

# చేయి చేయి కలుపుదాం

రోజురోజుకి పెరిగిపోతున్న చర్చ్ డినామినేషన్స్ గూర్చి చాలా ఆందోళన చెందుతూ జాన్‌వెస్లీ (1703-1791) తనకు వచ్చిన కల గురించి చెప్పాడు. కలలో తాను నరకం యొక్క ద్వారాల దగ్గరకు వెళ్ళి, అక్కడ ఉన్నవారిని "ఇక్కడ ప్రెస్బిటేరియన్‌లు ఎవరైనా ఉన్నారా? అని అడిగాడు. 'అవును' అనే సమాధానం వచ్చింది. "బాప్టిస్ట్‌లు ఎవరైనా ఉన్నారా? అని అడిగాడు. మరలా 'అవును' అనే సమాధానం వచ్చింది. తర్వాత "ఎపిస్కోపాలియన్‌లు, మెథడిస్ట్‌లు ఎవరైనా ఉన్నారా? అని అడిగాడు. అతను అడిగిన ప్రతి డినామినేషన్‌కు చెందినవారు అక్కడ ఉన్నారనే సమాధానం వచ్చింది. చాలా బాధతో వెస్లీ పరలోక ద్వారాల దగ్గరకు వెళ్ళి అక్కడ కూడా ఇవే ప్రశ్నలు అడిగాడు. 'అలాంటివారు ఎవరూలేరు' అనే సమాధానం వచ్చింది. ఆశ్చర్యపోతూ అయితే "పరలోకంలో ఎవరున్నారు?" అని అడిగితే ఇక్కడ "క్రైస్తవులు మాత్రమే ఉన్నారు" అని సమాధానం వచ్చింది.

నేటి క్రైస్తవ లోకం ఎదుర్కొంటున్న అతి గొప్ప సమస్య 'డినామినేషనల్, సంస్థల ఫీలింగ్'. ప్రాముఖ్యమైన క్రైస్తవ దురాచారాల్లో ఇది ఒకటి. తమ కోసం ప్రాణం పెట్టిన ప్రభువుకంటే వారి నాయకులను దైవాంశ సంభూతులుగా అభిమానిస్తూ కొరింథీ సంఘంలోని గ్రూపిజాన్ని గుర్తుచేస్తున్నారు (1 కొరింథీ 1:10-12). ఒకరిని ఒకరు ద్వేషించుకొంటూ, విమర్శించుకొంటూ మాది గొప్పంటే, మాది గొప్ప అని పొడుగుకొంటూ, ప్రచారం చేసుకొంటూ అడ్డుగోడలు కట్టుకొంటున్నారు. ఈ లోకంలో కలవడానికి అస్సలు ఇష్టపడరు, పరలోకంలో మాత్రమే కలుస్తాము అన్నట్లు ఉంటుంది వీరి తీరు. క్రీస్తు ప్రభువు రక్తాన్ని కార్చి వ్యక్తుల మధ్య అడ్డుగోడల్ని తొలగిస్తే (ఎఫెసీ 2:11-22), స్వార్థం, పగ, ఈర్ష్య, గర్వము, అసూయ, కలహాలు, ద్వేషాలతో మరలా విభజన గోడల్ని కడుతున్నారు. అందుకే లోకాన్ని ప్రభావితం చేయాల్సిన సంఘంలోకి లోకమే చొచ్చుకొచ్చింది. నశించిపోయేవారి సంఖ్య రోజురోజుకి పెరుగుతూనే ఉంది.

యుఇయస్ఐ ప్రారంభం నుంచి ఈ విషయంలో స్పష్టమైన వైఖరి కలిగి ఉంది. యుఇయస్ఐకి డినామినేషనల్ ఫీలింగ్ లేదు. దీనిలోని సభ్యులు దేవుని వాక్యానికి ప్రాధాన్యతనిచ్చే, తప్పుడు బోధలు లేని అన్ని సంఘాలకు వెళ్తూ వారి సంఘాల్లో చురుకుగా పాల్గొంటారు. యుఇయస్ఐ రెండవ లక్ష్యమైన సహవాసం 'మనవలె అమూల్య విశ్వాసం గల వారందరితో (2 పేతురు 1:1) సహవాసం చేయాలని, ముఖ్యంగా వాక్యధ్యానం, ప్రార్థనల ద్వారా క్రైస్తవ జీవితంలో ఒకరికొకరు పరస్పరం సహాయపడుతూ, ఎదుగుతూ క్రీస్తుకొరకు సాక్షులుగా ఉండేలా ప్రోత్సహించుకోవాలని' తెలియజేస్తుంది. ఈ మధ్య రూపొందించిన యుఇయస్ఐ-ఏపి యల్ఆర్‌పి -2030లో 'ప్రేషిత సేవా భాగస్వామ్యం' అనే అంశాన్ని ఆరవ ఫోకస్ ఏరియాగా చేర్చింది. సర్వసృష్టికి సువార్తను ప్రకటించడమనేది ఏ ఒక్క వ్యక్తి, సంఘం లేదా సంస్థ వల్లనో సాధ్యమయ్యేది కాదు. ప్రభువిచ్చిన ఆజ్ఞను నెరవేర్చడానికి భావస్వారూప్యత కలిగిన సంస్థలు, సంఘాలతో సత్‌సంబంధాలు, భాగస్వామ్యాన్ని ఏర్పరచుకొని కలిసి పనిచేయాలనేది దీని ఉద్దేశం. ఆ దిశగా యుఇయస్ఐ ఆరంభంనుంచి పనిచేస్తుంది, చేయడానికి ఆసక్తి కలిగి ఉంది.

సంఘాలు, సంస్థల మధ్య అనైక్యత ఉన్నప్పుడు వారిద్వారా గెలిచేది సాతానుడే. మనం సాతానుని గెలిపించడానికి పనిచేయట్లేదు, చేయకూడదు కూడా. మనం చేసే పరిచర్యలో ఐక్యతను సాధించాలంటే మొదటిగా మనం మన శత్రువులైన స్వార్థం, గర్వం, అసూయ మొదలైనవాటిని గుర్తించి వాటిని సిలువకు కొట్టాలి. ఆ తర్వాత, నశించిపోయిన ఆత్మలను రక్షించాలన్న ఏకైక లక్ష్యంతో పనిచేయాలి. క్రైస్తవ ఐక్యతను తెలియజేయడానికి ఎఫెసీ 4:4-6లో అపొస్తలుడైన పౌలు ఏడు పదాలు వాడాడు: ఒక్క శరీరం, ఒక్క ఆత్మ, ఒక్క నిరీక్షణ, ఒక్క ప్రభువు, ఒక్క విశ్వాసం, ఒక్క బాప్తీస్మం, ఒకే తండ్రియైన దేవుడు. అలాగే, త్రిత్వంలోని ఐకమత్యం, పని విభజన మన మధ్య ప్రేమలకు, సంబంధాలకు, భారాన్ని భరించడానికి, పరిచర్యకు ఆధారం కావాలి.

భారతదేశంలోని అధికారిక లెక్కల ప్రకారం క్రైస్తవులు 2.32%, అనధికారంగా మరికొంతమంది ఉన్నా, దేవుని ఎరుగని వారి సంఖ్య కనీసం 85% ఉంటుంది. అలాగే అన్‌రీచ్డ్ ప్రాంతాలు, కాలేజ్‌లు ఎన్నో సంవత్సరాలుగా ఇంకా అలాగే ఉండిపోతున్నాయి. ఎందుకని? ఒకరికొకరు సహకరించుకోకపోవడం వల్ల, కలిసి పనిచేయకపోవడం వల్లనే. క్రైస్తవ్య వ్యాప్తిని నిరోధించే శత్రువులు బయటివారు కాదు కాని, లోపలే ఉండి స్వార్థంతో వ్యవహరిస్తూ, విభజనలు చేసేవారే.

ఒకసారి ఓడలో ప్రయాణిస్తున్న కొందరు విశ్వాసులు దారుణంగా పోట్లాడుకుంటున్నారట. ఆ పోట్లాటను ఆసక్తిగా తిలకిస్తూ, చివరన కూర్చున్న ఓ ప్రయాణికుడు ఆదమరచి సముద్రంలో జారిపోయాడు. ఎప్పుడైతే ఆయన సముద్రంలో పడిపోయాడో ఆ విశ్వాసులు, తమ పోట్లాటను పక్కనపెట్టి ఐక్యతతో అతన్ని రక్షించడంలో నిమగ్నమైపోయారు. రోజూ అనేకమంది విద్యార్థులు, ప్రజలు నరకానికి వెళ్తున్నారన్న గ్రహింపు ఉంటే, వ్యర్థమైన వాటితో, అనైక్యతతో కాలక్షేపం చేయక ఏకత్వంతో, చురుకుగా నశించేవారిని క్రీస్తు కొరకు గెలిచే పనిలో ఉంటాము. ఆ లక్ష్యం వైపు పయనిస్తే ఏ కాలేజ్ సెంటర్, ప్రాంతము కూడా అన్‌రీచ్డ్‌గా ఉండదు. ఆత్మల రక్షణకై కలిసి ప్రార్థిద్దాం, కలిసి పోరాడదాం, చేయి చేయి కలుపుదాం, ఐక్యతతో లక్ష్యం వైపు పయనిద్దాం.

**- పి. సునీల్ జాకబ్**

# విద్యార్థి జ్వాల



Vol. 29, No.7 May 2023
A Publication of
UESI Publication Trust



EDITORIAL BOARD:

Mr. B.J. Lazarus, Honorary Editor
Mr. P. Sunil Jacob - Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Dr. J. Subbarao - Sec., Litt.Dept.



CONTACT:

The Editor, Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com

GIFTS & SUBSCRIPTIONS:

Can be made by Cheque/DD/MO
in favour of UESI-AP,
Abhishek Nagar, Nambur - 522 508
ANNUAL: GRADUATES - Rs.250
STUDENTS - Rs. 120
LIFE INLAND - Rs. 2000
LIFE OVERSEAS - US $ 150

VIDYARTHI JWALA ACCOUNT NO:

**SBI - 36698741798**
**IFS Code: SBIN0011994**
**uesiap vj, Nambur Branch**

GENERAL CONTRIBUTIONS ACCOUNT NO:

**SBI - 10949477628**
**IFS Code: SBIN0000844**
**Commercial Branch, Guntur**

LITERATURE ACCOUNT NO:

**SBI - 36698741437**
**IFS Code: SBIN0011994**
**uesiap pt, Nambur Branch**

**Please inform/ SMS to**
**Mr. A. Venu, Accountant (9849516060)**
**Email: <uesiapacc84@gmail.com>**

TOPICS:

June: Building Christlike leadership
July: Testimony in College
August: UESI Cutting Edge
September: Unity
October: Power through Prayer
November: Fear of God
December: The Uniqueness of Jesus Christ

**Note:** Please send your writeups on or before
**10th of every month**


# చేయి చేయి కలిపి



చేయి చేయి కలిపి
యేసు మనసును కలిగి
మనము మనసులు కలిసి
ఏకమనసును కలిగి

*కలిసి మెలిసి పనిచేద్దాం – ఏకముగా ప్రార్థిద్దాం*
*కలిమిలోన – లేమిలోన – కలకాలం కలిసుందాం*

1. అహం, కులం – వదిలేద్దాం – అంతరాలు పూడ్చేద్దాం
   ఒకరి నొకరు యోగ్యులుగా – అందరినీ ఎంచుదాం
2. విలువైన రక్తముతో – కొనబడిన సహవాసం
   విభేదాలు విడనాడి – విలువలను నాటుదాం
3. దారుణమగు హింసలలో – ధైర్యంగా నిలబడదాం
   హింసకులను క్షమించి – రక్షణకై ప్రార్థిద్దాం

## లోపలి పేజీల్లో...


- చేయి చేయి కలుపుదాం - 2
- సంఘము - 4
- నువ్వు ఎవరివో మరి? - 7
- ప్రేషితోద్యమం, ప్రేమ ఉద్యమం - 8
- మిషన్స్ ఒక ఎంపిక కాదు, బాధ్యత - 11
- మంచి పేరు చెడ్డ తీరు - 14
- జీవితానికి పునాదులు, ప్రణాళికలు ఆయనే వేస్తాడు - 15
- గతంలోకి తొంగిచూస్తే - 17
- ఆయన పనికి సెలవు లేదు - 18
- 10 మిషనరీ సూత్రాలు - 21
- కొత్త విస్తారమే... - 24
- టర్నింగ్ పాయింట్ - 26
- ఓ మిషనరీ - 27
- అప్పగించబడిన పని - 28
- కోశాధికారి లేఖ - 31
- జార్జ్ వర్వర్ - 32





# సంఘము

## ఒక నిర్జీవ కట్టడం కాదు, సజీవుల సమూహం

'చర్చ్' అనేమాట 'ఎక్లేషియా' అను గ్రీకు పదం నుండి వచ్చింది. ఈ పదం కూడా 'ఎక్' మరియు 'కెల్సియ' అను రెండు పదముల కలయిక ద్వారా ఏర్పడింది. ఎక్లేషియా అనగా 'బయటకు పిలుచుట లేక ప్రత్యేకపరచుట'. నిజముగా దేవుని సంఘము ఈ లోకవ్యవస్థ నుండి ప్రత్యేకించబడిన విశ్వాసుల సమూహము. వారి జీవిత విలువలు ఇహలోకానికి సంబంధించినవి కాదు. అందుకే వారు ఈ లోకంలో అందరిచే ద్వేషించబడతారు, వింతగా కనబడతారు.

యేసుప్రభువు సిలువ వేయబడి సమాధి చేయబడి తర్వాత మరణమును జయించి మూడవ దినాన్న తిరిగి లేచుట ద్వారా తాను దేవుడనని లోకమునకు రావలసిన మెస్సీయనని వారికి తెలియజేశాడు. ప్రభువు 40 రోజులు శిష్యులతో గడిపి దేవుని రాజ్యమును గూర్చిన అనేక విషయాలు వారికి బోధించి, వారు చూచుచుండగా పరమునకు ఆరోహణమవడం మనమెరిగిన సత్యమే. ఆయన ఆరోహణమగుటకు ముందు శిష్యులందరిని యెరూషలేములోనే వేచియుండి, తండ్రియొద్దనుండి పంపబడే పరిశుద్ధాత్మను పొంది శక్తి గలిగి లోకమంతటికి సువార్తను తీసుకొని వెళ్ళాలని ఆజ్ఞాపించాడు. అదేవిధంగా పెంతెకొస్తు పండుగ దినమున శిష్యులతో కూడా దాదాపు 120 మంది ఒక మేడగదిలో ప్రార్థన చేస్తుండగా పరిశుద్ధాత్మ దేవుడు అగ్నినాలు కలలాగా వారి మీద నిలిచినట్లు చూశారు. వెంటనే వారు అనేక దేశభాషలలో దేవుని గొప్ప కార్యాలు వివరించి అందరిని ఆశ్చర్యపరిచారు. ఈ కార్యం వారు భవిష్యత్‌లో ఏమి చేయబోతున్నారో దానిని తెలియజేశారు. దేవుని 'సంఘం' జన్మించిన దినం అదే! భూమి పునాదులు వేయబడకముందే దేవుని మనసులో దాచబడిన ఆ అద్భుత ప్రణాళిక భూమిపై రూపుదాల్చిన శుభవేళ ఆ పెంతెకొస్తు పండుగ 'రోజే!' ఆ రోజున 3000 మంది యేసుప్రభువును తమ స్వంత రక్షకునిగా అంగీకరించి బాప్తీస్మంలో పాలు పొంది సంఘమునకు చేర్చబడ్డారు. ఆ దినము నుండి ఈ రోజు వరకు సంఘమునకు విశ్వాసులు చేర్చబడుతూనే ఉన్నారు. "ఈ బండ మీద నా సంఘమును కట్టుదును. పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువనేరవని" ప్రభువు మత్తయి 16:18లో చెప్పినట్లు 'నా' అని ప్రభువు చెప్పినది బహుశా సంఘము ఒక్కదాని గూర్చే.

సంఘము దేవుని దృష్టిలో అత్యంత విలువైనది,

బలమైనది. దేవుని సత్యము ఈ లోకములో తెలియజేయుటకు దేవుడు వాడుకొను సాధనమై ఉందని 1 తిమోతి 3:16లో రాయబడింది. సంఘము ఒక నిర్జీవ కట్టడం కాదు, అది సజీవుల సమూహం. వారిలో దేవుని జీవం ప్రవహిస్తుంది, దేవుని ఆత్మ నివాసం కలిగిన వారు. వీరు దేవుని రాజ్యపౌరులు, ఈ లోకానికి చెందినవారు కాదు. శారీరకంగా ఈ భూమిపై జీవిస్తున్నప్పటికీ, వారి జీవిత విధానం దేవుని రాజ్య విలువలపై ఆధారపడి ఉంటుంది.

మొదటి శతాబ్దములో సంఘము యెరూషలేములో ప్రారంభమై ప్రభువు సెలవిచ్చినట్లు గలిలయ, సమరయ మరియు భూదిగంతముల వరకు విస్తరించడం ప్రారంభించింది. రోమా సామ్రాజ్యం మొదట్లో అంతగా పట్టించుకోకపోయినా, రోజులు గడిచేకొద్ది వందలు, వేలు, లక్షల సంఖ్యలో విశ్వాసులు సంఘమునకు చేర్చబడుతూ, సీజర్ యొక్క దైవత్వాన్ని తృణీకరిస్తూ యేసుప్రభువుని తమ నోటితో బహిరంగంగా ఒప్పుకొని ప్రాణాలను సహితం లెక్కచేయకుండా విస్తరించడం మానవ అంచనాలకు అందనిది. ఆ ప్రక్రియలో ఎందరో తమ ప్రాణాలను తృణప్రాయంగా కోల్పోవడానికి ఇష్టపడ్డారు.

పౌలు, పేతురులాంటి అపొస్తులుల పరిచర్య ద్వారా అనేక స్థలాలలో, పట్టణాలలో స్థానిక సంఘాలు ఏర్పడ్డాయి. యెరూషలేములోను, అంతియొకయ, ఫిలిప్పీ, థెస్సలోనిక, కొరింథీ, రోమా, ఎఫెసు మొదలగు పట్టణాలలో స్థానిక సంఘాలు ఏర్పడి, సువార్త ప్రకటించడమే జీవిత పరమావధిగా యెంచి జీవించారు. ప్రారంభ దినాలలో గృహాలలోనే ఆరాధనలు జరిగేవి. ప్రార్థనలు, పాటలు, పాతనిబంధన చదువుట, అపొస్తులుల ఉత్తరములను చదువుట జరిగేది. ఒకరిద్దరు దేవుని వాక్యమును వివరించేవారు. రొట్టె, ద్రాక్షారసము ద్వారా ప్రభువు మరణమును జ్ఞాపకం చేసుకొనేవారు. దీనిని వారు 'సహవాస భోజనము' అని పిలిచేవారు. ఆ దినములలో ఆదివారము సెలవు లేదు.

## మొదటి రెండు శతాబ్దాలలో సంఘ వ్యాప్తి

పౌలు వలె అనేక మంది భక్తిపరుల నిర్విరామ కృషి ఫలితంగా క్రైస్తవ్యం తూర్పు దేశాలకు, ఐగుప్తు, అలెగ్జాంద్రియ పట్టణములకు, మధ్యధరా సముద్ర ప్రాంతములకు, రోమా పట్టణము వరకు వ్యాపించింది. సువార్త ప్రకటన సంఘములోని ప్రతి విశ్వాసి కర్తవ్యముగా వారు భావించేవారు.

> **ఇ**యు పరిచర్య, సంఘ పరిచర్యకు పోటీగా గానీ వ్యతిరేకతతో గానీ కాక దానికి సహకరించేదిగా ఉండాలి. దానికోసం సంఘనాయకులు, ఇజియఫ్ నాయకుల మధ్య చక్కని అవగాహన, కమ్యూనికేషన్ ఉండాలి. ఒకరి కొకరు సహకరించుకొంటూ, సంఘపరిచర్యకు చేదోడువాదోడుగా నిలిస్తే దేవుని కొరకు గొప్పకార్యాలు చేపట్టగలం, సాధింపగలము.

ఈ కాలములో చాలా సువార్తలు, పత్రికలు సంఘములోనికి ప్రవేశించాయి. వీటిలో కొన్ని అపొస్తలులు కాక ఇతరులచే రాయబడినవి. ఇవి మానవ జ్ఞానముతో రాయబడినవి. క్రీ.శ. 140లో మార్కియన్ అనే భక్తుడు ఒక నూతన నిబంధనను ప్రాచుర్యంలోనికి తెచ్చాడు. ఈ పరిస్థితులలో దైవప్రేరిత లేఖనములను గుర్తించడమనేది ప్రాముఖ్యతను సంతరించుకొన్నది. దీనికొరకు సంఘపెద్దలు కొన్ని దైవప్రమాణములను కొలబద్దగా (కేనన్) నిర్ణయించారు. పుస్తక రచయిత అపొస్తలుడు గానీ, అపొస్తలులకు సన్నిహితుడుగానీ అయివుండాలి. ఆ రాతలలో ఆత్మప్రేరిత సాక్ష్యం ఉండాలి. దేవుని ప్రజలు దానిని దైవవాక్యంగా అంగీకరించాలి. చివరికి సంఘపెద్దలు, దైవజనులు కూడి క్రీ.శ. 397లో ఇప్పుడు మనము కలిగివున్న 27 పుస్తకాలతో కూడిన నూతన నిబంధనను ఏర్పరచారు.

## సువార్త వ్యాప్తి

క్రీ.శ. 597లో గ్రెగరి ద గ్రేట్ అనే రోమన్ బిషప్, అగస్టీన్ వంటి క్రైస్తవ సన్యాసులను ఇంగ్లాండు దేశానికి పంపి సువార్తను చాటింప చేశాడు. క్రీ.శ. 7వ శతాబ్దం నాటికి ఇంగ్లాండ్‌లో ఎక్కువ భాగం క్రైస్తవ విశ్వాసంలోనికి వచ్చింది. ఇంగ్లాండ్‌కి చెందిన బోనిఫేస్ ద్వారా సువార్త జర్మనీ దేశానికి చేరింది. ఇతని పరిచర్య ద్వారా జర్మనీ దేశం క్రైస్తవ దేశంగా మారింది. క్రీ.శ. 1000లో సిఫ్‌గ్రిడ్ స్వీడన్ దేశానికి సువార్త తీసుకొని వెళ్ళాడు. క్రీ.శ. 1200లో రష్యా దేశానికి క్రైస్తవ్యం వ్యాపించింది.

## క్రూసేడ్లు

మహమ్మదీయులకు, ఇస్లాంకు వ్యతిరేకంగా క్రైస్తవ రాజులు, పోప్‌లు జరిగించిన యుద్ధముల ను క్రూసేడ్లు అంటారు. 1095-99లో మొదటి క్రూసేడ్ జరిగింది. 1145లో రెండవ క్రూసేడ్ జరిగింది. ముస్లిమ్స్ యెరూషలేమును స్వాధీనం చేసుకొన్నారు. 1244లో యెరూషలేము ఈజిప్ట్ స్వాధీనంలోనికి వెళ్ళింది. అప్పటి నుండి 1917 వరకు ముస్లిమ్స్ స్వాధీనంలోనే ఉంది. ఈ క్రూసేడ్ల కారణంగా క్రైస్తవులకు, ముస్లింలకు మధ్య ద్వేషాలు పెరిగిపోయాయి.

13,14 శతాబ్దాలలో మతం రాజకీయాలలో కూరుకుపోయింది. పోప్‌ల పాలనలో మతం, లోకంతో రాజీపడిపోయింది. అనేక తప్పుడు బోధలు, సాంప్రదాయాలతో కేథలిక్ మతం నిండిపోయింది. దేవుడు దైవజనులను లేపుకొని సంస్కరణోద్యమాలు జరిపించాడు. అలా వాడబడిన వారిలో జాన్ విక్లిఫ్, జాన్‌హస్ ముఖ్యమైనవారు. జాన్‌హస్ కొయ్యకు కట్టబడి కాల్చబడ్డాడు. అతని తరువాత బొహిమియ సహోదరులు ఈ ఉద్యమాన్ని ప్రభావితం చేశారు. 1507 అక్టోబర్ 31న మార్టిన్ లూథర్ పోప్‌కు వ్యతిరేకంగా రాసిన అభియోగపత్రం (95 థీసిస్) ప్రొటెస్టంట్ ఉద్యమానికి ఊపిరిపోసింది. ఈ ఉద్యమ ఫలితంగా మూడు ప్రాముఖ్య శాఖలు ఉద్భవించాయి. అవి లూథరన్, కాల్వినిస్ట్, ఆంగ్లికన్ క్రైస్తవ శాఖలు.

15, 16 శతాబ్దాలలో మేరి రాణి ఆధ్వర్యంలో, హెన్రీ-8 రాజు కాలంలో వేలకొలది ప్రొటెస్టంట్స్ ఉరిశిక్షలకు అప్పగించబడ్డారు. హెన్రీ - VIII రాజు 70,000 మంది ప్రొటెస్టంట్ విశ్వాసులను చంపించాడు.

16-19 శతాబ్దాలలలో ప్రొటెస్టంట్స్‌కు, కేథలిక్స్‌కు బహిరంగంగా యుద్ధాలు లేనప్పటికీ, ద్వేషాలు, అంతర్యుద్ధాలు కొనసాగాయి. హంగేరి, పోలెండ్, స్పెయిన్‌లో ప్రొటెస్టంట్స్‌పై హింసాత్మక చర్యలు కొనసాగాయి. జాన్‌వెస్లీ, జార్జ్ విట్‌ఫీల్డ్ ఇంగ్లాండ్ దేశంలో గొప్ప ఉజ్జీవానికి కారకులై మెథడిస్టు, ఆంగ్లికన్ సంఘాలకు పితామహులయ్యారు. 19వ శతాబ్దంలో అమెరికా, యూరప్‌లు గొప్ప ఉజ్జీవాన్ని చూశాయి. చార్లెస్ ఫిన్ని (1792-1875) ఆ ఉజ్జీవానికి నాంది పలికాడు. ఫిన్ని ప్రభావంతో పెంతెకొస్తు ఉద్యమం క్రైస్తవ సమాజంలోనికి వచ్చింది. 19,20 శతాబ్దాలలో సంఘం మిషనరి పరిచర్యపై దృష్టి సారించింది. భారతదేశంలో విలియం కేరి (1761-1834) మొదలగువారు, చైనాలో హడ్సన్ టేలర్ తదితరులు, బర్మాలో అదోనిరామ్ జడ్సన్ తదితరులు, ఆఫ్రికాలో డేవిడ్ లివింగ్‌స్టన్ మొదలగువారు చేసిన పరిచర్య చిరస్మరణీయం.

రెండువేల సంవత్సరాల సంఘచరిత్రలో దేవుని కోసం తమ ప్రాణాలర్పించిన వారి సంఖ్య లక్షల్లో ఉంటుంది. దానికి బలమైన కారణం ఉంది. దేవుని సంఘం ఈ లోకవ్యవస్థలో ఇమడలేదు. సాతాను ప్రభుత్వమైన లోకవ్యవస్థ దేవుని సంఘమునకు, దాని విలువలకు పూర్తి వ్యతిరేకం. అందుకే వారు వారి ప్రభువులా లోకం చేత ద్వేషించబడతారు. ఈ సంఘము ఒక ఆర్గనైజేషన్ కాదు గాని ఒక సజీవ సమూహం. దైవగ్రంథంలో సంఘము వధువుతోను, శరీరముతోను పోల్చబడింది. సంఘములోని విశ్వాసులు వేరువేరు కృపావరాలు కలిగి ఉండి ఒకరికి ఒకరు క్షేమాభివృద్ధి కలుగజేస్తారు. ప్రతి విశ్వాసికి సంఘములో ఏదో ఒక పరిచర్య ఉంటుంది. శరీరములో పనిలేని అవయవము ఉండదు కదా!

## యుఇయస్ఐ- సంఘము

యుఇయస్ఐ సంఘము కాదు గానీ సంఘ అనుబంధ సంస్థ. సంఘమునకు విశ్వాసులను చేర్చే ఒక సహకారి. సంఘము అన్నప్పుడు సార్వత్రిక సంఘము, స్థానిక సంఘము అని రెండు సందర్భాలను గుర్తించాలి. సార్వత్రిక సంఘములో ప్రపంచములోని యేసుక్రీస్తు ప్రభువుకు చెందిన ప్రతి విశ్వాసి సభ్యుడై ఉంటాడు. మారుమనసు పొందగానే ప్రతి విశ్వాసిని దేవుడు సార్వత్రిక సంఘములో సభ్యునిగా చేస్తాడు. కానీ ఆ వ్యక్తి స్థానికంగా ఒక విశ్వాస సంఘములో తప్పక సభ్యుడై ఉండాలి. అక్కడే తోటివిశ్వాసులతో కలిసి ప్రభుదినంలో ఆరాధించాలి. ఇది చాలా ప్రాముఖ్యమైన విషయం. స్థానిక సంఘ పెద్దలతో, కాపరులతో చక్కని సంబంధాలు కలిగి ఉండాలి.

దేవుడు యుఇయస్ఐని గత సంవత్సరాలలో ఎంతో దీవించి భారతదేశంలోని విద్యార్థులకు యేసుప్రభువు సువార్తను అందించడానికి వాడుకుంటున్నాడు. సువార్త విని మారుమనసు పొందిన ప్రతి విద్యార్థిని తప్పక ఒక విశ్వాస సంఘమునకు నడిపించవల

సిన బాధ్యత స్థానిక ఇయు, ఇజియఫ్ పెద్దలపై ఉంది. సంఘమును గూర్చిన సరైన అవగాహన ఇయు విద్యార్థులకు తప్పక తెలియజేయాలి. ఇయు, ఇజియఫ్, సంఘం చేయు కొన్ని ప్రాముఖ్యమైన పనులు చేయలేదు. సంఘములో ఆదివారము ఆరాధించుట, రొట్టె విరుచుట, బాప్తీస్మము మొదలైన కార్యక్రమాలు జరుగుతాయి. ఆ కార్యక్రములలో పాలుపంపులు కలిగి యుండుట ప్రతి విశ్వాసి బాధ్యత. యుఇయస్ఐలోని సభ్యులు వారంలో జరుగు సంఘ కార్యక్రమముల న్నిటికి హాజరు కాలేకపోవచ్చు. కానీ ఆదివారము ఆరాధన కార్యక్రమము, సంఘప్రార్థన వంటివి చాలా ప్రాముఖ్యము. యుఇయస్ఐ కార్యక్రమాలు సాధారణంగా సెలవు దినాల్లో, వారాంతంలోనూ ఉండుట వలన కొన్ని ఆదివారములు సంఘమునకు వెళ్ళకపోవుట జరుగుతుంది. కానీ సాధ్యమైనంతవరకు ఆదివార ఆరాధనకు అంతరాయం కలుగకుండా కార్యక్రమాలు రూపొందించుకొనుట క్షేమం.

ఇయు పరిచర్య, సంఘ పరిచర్యకు పోటీగా గాని వ్యతిరేకతతో గానీ గాక దానికి సహకరించేదిగా ఉండాలి. దానికోసం సంఘనాయకులు, ఇజియఫ్ నాయకుల మధ్య చక్కని అవగాహన, కమ్యూనికేషన్ ఉండాలి. ఒకరికొకరు సహకరించుకొంటూ, సంఘ పరిచర్యకు చేదోడువాదోడుగా నిలిస్తే దేవుని కొరకు గొప్పకార్యాలు చేపట్టగలం, సాధించగలము. 2018 జనవరి సంక్రాంతి సెలవులలో జరిగిన 'స్టే అండ్ సౌండ్ ద గాస్పల్' ప్రోగ్రామ్ చాలా వరకు స్థానిక సంఘములతో చక్కని సంబంధాలకు తెరతీసింది. దానిని కొనసాగించి అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. ఇయు సండే కార్యక్రమాల ను స్థానిక సంఘాలలో జరిగించడం వలన మన పరిచర్య గూర్చి అవగాహన కలిగించడానికి గొప్ప అవకాశము. యుఇఎస్ఐ, స్థానిక సంఘము ఒకే గమ్యంను కలిగి ఉన్నాయని, మనము పోరాడు శత్రువు కూడా ఒకడేయని గుర్తించి ఒకరినొకరు ప్రార్థనలో బలపరచుకొంటూ మన విద్యార్థులకు సంఘమును గూర్చిన సమతుల్యమైన అవగాహన అందించి వారి ఆత్మీయ జీవితాలను, చదువులను, పరిచర్యను సమన్వయం చేసుకొంటూ కొనసాగించడానికి గ్రాడ్యుయేట్స్‌గా కృషి చేద్దాం. ఈ పెద్ద బాధ్యత మన మీద ఉందని గుర్తించి భారతదేశంలో దేవుని రాజ్య స్థాపనకు మనవంతు కృషి చేద్దాం.

**కె. డేవిడ్ రాజ్ కుమార్,** గుంటూరు

కవిత

# నువ్వు ఎవరో మరి??



శరీరాన్ని ప్రాణార్పణంగా పెట్టిన వాళ్ళు కొందరైతే
శరీరం కోసమే బతికేవాళ్ళు మరి కొందరు

నశించే ఆత్మలకోసమే బతికే వాళ్ళు కొందరైతే
నశించే వాటి కోసమే బతికే వాళ్ళు మరికొందరు

రాత్రింబగళ్ళు కన్నీళ్ళతో గడిపే పౌలులాంటి వాళ్ళు
కొందరైతే, రాత్రింబగళ్ళు శరీరసుఖాల కోసం గడిపే
ధనవంతునిలాంటి వాళ్ళు మరికొందరు

పరిచర్యలో కన్నా ప్రభువుతో గడిపే వాళ్ళు
కొందరైతే ప్రభువుతో కంటే పరిచర్యలో ఎక్కువ
గడిపే వాళ్ళు మరికొందరు.

కుటుంబ బంధాలు కూడా పరిచర్యకొరకు
ధారపోసిన వారు కొందరైతే
కుటుంబం కోసమే ఈ జీవితం అనే వాళ్ళు మరి
కొందరు

అప్పుడప్పుడు బోధిస్తూ నిత్యం అలా జీవించే
వాళ్ళు కొందరైతే నిత్యం బోధిస్తూ అప్పుడప్పుడు
అలా జీవించే వాళ్ళు మరికొందరు

ఘనత ప్రభువుకే చెందాలి అనే దావీదులాంటి
వాళ్ళు కొందరైతే
ఘనత మాకే చెందాలి అనే మిర్యాము
అహరోనులాంటి వాళ్ళు మరికొందరు

**– జి.పవన్ కుమార్,** విస్సన్నపేట



# ప్రేషితోద్యమం
# ప్రేమ ఉద్యమం...

ఒక ఇంజనీరింగ్ కాలేజ్‌లో మెకానికల్ విభాగంలో పనిచేసే ఒక ప్రొఫెసర్ థర్మో డైనమిక్స్ సబ్జెక్ట్‌లో ఇంజన్ పనిచేసే విధానాన్ని గూర్చి చెబుతూ 'వెహికల్ మొత్తాన్ని ముందుకు తీసుకెళ్ళే ప్రక్రియలో ఇంజన్ ప్రాముఖ్యమైన పాత్రను పోషిస్తుంది. అయితే ఆ ఇంజన్ పని చేయాలంటే దానిలో ఆయిల్ మరింత ముఖ్యమైన పాత్ర వహిస్తుంది" అని అన్నాడు. లిక్విడ్ రూపంలో ఉన్న ఆయిల్ డ్రాప్స్ ఇంజన్ సిలిండర్ లోకి వెళ్ళి మండడం ద్వారా అది ఇంజన్‌ని రన్ చేస్తుంది. ఆ ఇంజన్, వెహికల్ ఎంత బరువున్నా ముందుకు తీసుకువెళ్తుందని చెప్పి ఈ విషయాన్ని సువార్తతో పోలుస్తాడు. దేశాలు దాటి ఖండాలు దాటి ఆనాడు మిషనరీస్ శ్రమలు ఉంటాయని తెలిసి, కష్టమని ఎరిగి, ప్రాణాలు పెట్టాల్సి ఉంటుందని తెలిసి కూడా రాగలిగారంటే తమ జీవితం అనే ఇంజన్‌లో మంట పుట్టించే ఆయిల్ ఉంటుందని ఆలోచిస్తూ, ఆ ఆయిల్ మరేదో కాదు "క్రీస్తు ప్రేమ" అని గ్రహిస్తాడు. అవును ప్రేషితోద్యమం అనే దారిలో ఘోరమైన మార్గాల గుండా అతి బరువైన, పెద్దదైన జీవన వాహనాన్ని నడిపేది క్రీస్తు ప్రేమ అనే అతి చిన్న ఆయిల్. ప్రేషితోద్యమం ఒక ప్రేమ ఉద్యమం, చాలా రాజ్యాలు కత్తితో కట్టబడి, ఆ కత్తితోనే కూలిపోయాయి. కానీ క్రీస్తు రాజ్యం మాత్రం ప్రేమతో కట్టబడి ప్రేమతో నడుస్తుంది. గనుక ప్రేమలేని ప్రేషిత సేవను మనం చూడలేము.

"మిషన్స్" అనే మాట "మిస్సియో" అనే లాటిన్ పదం నుండి వచ్చింది. గ్రీకులో దీనిని "డియో" అని అంటారు. దీనర్థం ఒక వ్యక్తి లేదా వ్యక్తుల సమూహం ఒక ప్రత్యేకమైన, ప్రాముఖ్యమైన పని నిమిత్తం వెళ్ళడం లేదా పంపబడడం. ఈ పదాన్ని మిలటరీలో సైనికులను యుద్ధ ప్రాతిపదికన పంపేటప్పుడు, అంతరిక్షంలోకి వ్యోమోగాములను పంపేటప్పుడు వాడుతుంటారు. ప్రేషితోద్యమం అంటే క్రిస్టియన్ మిషన్ అని అర్థాన్నిస్తుంది, అలాగే గ్రేట్ కమీషన్ అనే అర్థాన్ని కూడా ఇస్తుంది. అనగా క్రీస్తు తన యందు విశ్వాసముంచిన శిష్యులకు ఆయన అప్పగించిన ఉన్నతమైన పనిగా బైబిల్‌లో చూడవచ్చు.

1964సం॥లో యుఇయస్ఐ 10వ వార్షికోత్సవం జరుపుకొంటున్న సందర్భంలో నాల్గవ లక్ష్యంగా మిషన్స్‌ని చేర్చడం జరిగింది. యుఇయస్ఐ మౌళిక విలువల రూపకల్పనకు యేసుక్రీస్తు ప్రభువు చెప్పిన కొండమీద ప్రసంగం ఎలా మూలమైందో ఈ నాల్గవ లక్ష్యానికి మార్కు సువార్త 16:15,మత్తయి సువార్త 28:19 వచనాలు ఆధారమయ్యాయి.

## మిషన్స్ స్టేట్‌మెంట్

"విశ్వవ్యాప్తమైన దేవుని ప్రేషిత ఆజ్ఞ (సర్వ లోకమునకు వెళ్లి సర్వ సృష్టికి సువార్తను ప్రకటించుడి) విషయమై తమ జీవితంలో దేవుని చిత్తాన్ని కనుగొని ఆయన చిత్తానికి లోబడి తామున్న చోట గాని ప్రపంచంలో మరి ఎక్కడైనా గాని విశ్వవ్యాప్తంగా సువార్తను అందించుట"

### ఏమిటి: "విశ్వవ్యాప్తమైన దేవుని ప్రేషిత ఆజ్ఞ"

సర్వలోకమునకు వెళ్లి సర్వ సృష్టికి సువార్తను ప్రకటించుడి (మార్కు సువార్త 16:15). ఇది యేసు క్రీస్తు ప్రభువు వారు తన శిష్యులకు ఇచ్చిన ఆజ్ఞగా చూడు. ఇది దేవుని ఆజ్ఞ, దేవుని ఆశ కూడా. ఎందుకంటే అందరూ ఆయనను తెలుసుకోవాలని అన్యజనులలో ఆయన కీర్తింపబడాలని (కీర్తనలు 67), అందరూ, అంతటా మారుమనసు పొందాల నేది ఆ దేవుని అనాది కాల సంకల్పం. ప్రేషితోద్యమం అనేది ప్రేమాస్వరూపి అయిన దేవుని దర్శనం.

### ఎవరు: "తమ జీవితంలో" విశ్వాసుల జీవితంలో

ఇండియాలో శక్తివంతమైన మిషనరీ నాయకుడైన డా. విల్బర్ ఒకరోజు ముగ్గురు నావిక అధికారులతో కలిసి భోజనం చేస్తూ ఉన్నాడు. వారు సంభాషించుకొంటూ ఉండగా వారిలో ఒక అధికారి ఇలా అన్నాడు ఈ మిషనరీస్ సువార్తికులు ఎందుకు వారి ఆస్తిపాస్తులు, ఉద్యోగాలు దేశాలు విడిచి సువార్త ప్రకటిస్తారు. వారి పని వారు చూసుకోవచ్చు కదా!

అందుకు డా. విల్బర్ బదులిస్తూ ఒకవేళ రేపటికి మీ యుద్ధనౌకను కాన్‌స్టాంట్‌నోపుల్‌కు తీసుకెళ్ళమనే ఆజ్ఞ వస్తే, మీరు ఏం చేస్తారు? వెళ్లాలా? వద్దా? అని ఆలోచిస్తారా లేక తక్షణమే సమస్తాన్ని విడిచి వెళ్తారా? అని అడిగాడు. అందుకు ఆ అధికారి బదులిస్తూ అలా ఆదేశించబడితే ప్రాణాలు పోయినా తప్పక వెళ్లాల్సిందే అని అంటాడు. అందుకు విల్బర్ సరిగ్గా చెప్పారు. మాకు కూడా "మీరు సర్వ లోకానికి వెళ్ళి సర్వసృష్టికి సువార్త ప్రకటించుడి" అని పరలోక ప్రభుత్వం నుండి ఆదేశం వచ్చింది. అందుకే ఈ ప్రయాస, ఈ సువార్త సేవ అని దృఢంగా చెప్పాడు ఆ మిషనరీ.

రక్షణపొంది, యేసుక్రీస్తు శిష్యులైన వారందరికీ ఈ ఆజ్ఞ వర్తిస్తుంది. యోహాను సువార్త 17:18లో ప్రభువు వారు చేసిన దీర్ఘ ప్రార్థనలో కూడా "తండ్రీ నీవు నన్ను పంపిన రీతిగా నేను వీరిని లోకంలోనికి పంపుచున్నాను" అని అంటాడు. కాబట్టి రక్షణ పొందిన ప్రతి విశ్వాస విద్యార్థి, గ్రాడ్యుయేట్, సంఘ సభ్యుడు ప్రతి ఒక్కరూ ప్రపంచ సౌవార్తీకరణలో పాలిభాగస్తులు కావాలని ఈ లక్ష్యం తెలుపుతుంది.

### ఎలా: "దేవుని చిత్తాన్ని కనుగొని ఆయన చిత్తానికి లోబడి"..

దేవుని చిత్తమంటే మన పట్ల దేవుని ఉద్దేశ్యం, ప్రణాళిక ఆయన ఆలోచన అని చెప్పవచ్చు. దేవుని చిత్తాన్ని కేవలం దేవునికి అతి సమీపంగా ఉన్నప్పుడు మాత్రమే తెలుసుకోగలం. ఎందుకంటే ఆయన మెల్లని స్వరంతో మాట్లాడతాడు. ఆయనతో అనుదినం అలుపెరగని సహవాసం కలిగి ఉన్నప్పుడే ఆయన చిత్తాన్ని తెలుసుకోగలం. ఆయన అంతా ఒకేసారి చెప్పకపోవచ్చు గాని అసలు ఏం చెప్పకుండా మాత్రం పంపించడు.

### దేవుని చిత్తాన్ని తెలుసుకోవడానికి కొన్ని మార్గాలు

- దేవుని వాక్యం ధ్యానించడం
- వ్యక్తిగత ప్రార్థన ద్వారా హృదయంలో సమాధానం
- చుట్టూ జరుగుచున్న పరిస్థితుల ద్వారా కలిగే భారం
- దేవునిలో మనలను నడిపిస్తూ మనకోసం ప్రార్థన చేసే పెద్దల సలహాలు
- కొన్నిసార్లు మాత్రమే సూచనలు
- చాలా కొద్ది మందికి మాత్రమే కలలు, దర్శనాలు

వరల్డ్ విజన్ ఫౌండర్ బాబ్ పియర్స్ "దేవుని హృదయం ఏ విషయం నిమిత్తం బ్రద్దలవుతుందో నా హృదయం కూడా అవే విషయాలతో బద్దల వ్వనిస్తాను" అని అంటాడు. ప్రేషితోద్యమం అనేది దేవుని హృదయ స్పందన. ఆయన హృదయానికి దగ్గరగా హత్తుకొనబడిన వారికి కచ్చితంగా అది వినబడుతుంది. ఆయన హృదయాన్ని కలిగి జీవించే వారికి అది అర్థమవుతుంది. దేవుని చిత్తం తెలుసుకోవడం కష్టమైన పనేమీ కాదు. ఆయనను అడిగితే ఆయన చెప్పేస్తాడు. కానీ దేవుని చిత్తానికి విధేయత చూపడమే కష్టమైన పని అని చెప్పాలి. ఎందుకంటే ఇది మనం చేయాల్సింది, దీనికి వెలచెల్లించాల్సి

ఉంటుంది. అవిధేయత పాపంతో సమానం. కాబట్టి ప్రతి విద్యార్థి, గ్రాడ్యుయేట్ ప్రేషితోద్యమంలో పాల్గొనవలసిందే. ఇది అవకాశం కాదు అత్యవసరం మరియు ఖచ్చితం.

**ఎక్కడెక్కడ: "తాముున్న చోట గాని ప్రపంచంలో మరి ఎక్కడైనా గాని"**

మన ఆలోచనలు ప్రపంచానికి అనుగుణంగా ఉండాలి. అయితే మన పని మన చుట్టూ ఉన్న పరిస్థితులకు తగినట్టుగా ఉండాలి. మిషన్ అంటే ఎక్కడెక్కడకో వెళ్ళిపోవాలనుకోవడం ఒక అపోహ. మిషన్ మైండ్ కలిగి ఉండటం అంటే మనం ఉన్నచోట మనం ఒక మిషనరీగా దేవుని చేత పంపబడిన వారిలా పని చేయడం. అపోస్తులుల కార్యములు 1:8లో ప్రభువు ఆరోహణం అవుతూ శిష్యుల కప్పగించిన బాధ్యత దశలవారీగా చూస్తే ముందు యెరూషలేము (వారు నివసిస్తున్న ప్రాంతం), తర్వాత యూదయ (వారికి దగ్గరగా ఉన్న ప్రాంతం), తర్వాత సమరయ (కొంత దూరంగా ఉన్న ప్రాంతం), చివరికి భూదిగంతముల వరకు. ఆయన సర్వశరీరులకు క్రీస్తు సాక్షిగా ఉండడానికి పిలిచారు. యెరూషలేమంటే నువ్వు చదువుచున్న కాలేజ్, మీ క్లాస్మేట్, బెంచ్ మేట్, హాస్టల్ మేట్, కుటుంబీకులు. మనం ఉన్న చోట పని చేస్తేనే మనం వెళ్ళాల్సిన ప్రాంతాన్ని దేవుడు తెలపడం ప్రారంభిస్తాడు. అలా కాకుండా ఒక దిక్కున ఉండి పోదాం అనుకొని దేవుని చిత్తాన్ని తెలుసుకోకపోవడం దేవుని దర్శనానికి వ్యతిరేకమైనది (ఆదికాండం 11:4).

ప్రతి ఇయు విద్యార్థి తమ క్యాంపస్‌లో మిషనరీగా, ప్రతి ఇయు ప్రేషితోద్యమ నివాసం (మిషన్)గా ప్రతి ఇజియఫ్ ప్రేషితోద్యమంలో సహాయ కేంద్రం (మిషన్ సపోర్ట్ సెంటర్)గా ఉండాలనేది మిషన్స్ యొక్క స్లోగన్‌గా పరిగణించబడుతుంది.

**ఎందుకు: "విశ్వ వ్యాప్తంగా సువార్తను అందించుటకు"**


యేసుక్రీస్తు ప్రేమవార్త సర్వ మానవాళికి శుభవార్త. ప్రపంచంలో పాడైపోయిన ప్రతి రంగానికి ఈ సత్య సువార్త అత్యవసరమైన ఔషధం లాంటిది. ప్రేషితోద్యమం అనగానే ఒక సంచి తగిలించుకొని సాధారణమైన వస్త్రధారణతో చేతుల్లో కరపత్రికలు పట్టుకొని సువార్త చేయడం అనే చిత్రాన్ని ఊహించుకోవడం ఒక అపోహ. దేవుని ప్రేమ కరువై, సత్యం, నీతి, న్యాయం, దయ లేని మనుషుల మధ్య దేవుని ప్రేమతో నిండిన సువార్తను తీసుకెళ్ళడానికి వివిధ పద్ధతులు ఉన్నాయని తెలుసుకోవడం ముఖ్యం. ఇది మన ప్రపంచ మిషన్స్ చరిత్ర, మిషనరీస్ యొక్క జీవిత చరిత్రలను చదివినప్పుడు ఈ విషయం అర్థమవుతుంది.

1. **క్రైస్తవ మిషన్ అనేది పవిత్రమైనది:** మానవజాతి యొక్క భౌతిక, సామాజిక, సాంఘిక, సాంస్కృతిక మార్పులు దేవుని ఆదేశాలకు అనుగుణంగా అంటే పవిత్రంగా మారడం చూడవచ్చు. విద్య, వైద్య, రాజకీయ మొదలగు విషయాల్లో కూడా పవిత్రమైన మార్పుకోసం చూడవచ్చు.
2. **క్రైస్తవ మిషన్ అనేది విశ్వవ్యాప్తమైనది:** అన్ని జాతుల వారికి, అన్ని దేశాల వారికి, పల్లెటూరి ప్రజలకు, పట్టణాల వారికి, కొండ ప్రాంత వాసులకు, మురికివాడల్లో జీవించే వారికి, విద్యావంతులకు, వ్యాపారవేత్తలకు, భాష లేనివారి కి, పిల్లలకు, యవ్వనస్తులకు, నిరుపేదలకు, బానిసలకి అధికారులకి, నాయకులకి ఇలా అందరికీ అవసరమైనది.

**ప్రతిస్పందన...**

నా పని కాదు, నాకు సరిగా రాదు, నాకు సూట్ కాదు అనే కారణాలు వెతకవద్దు. మునుపు తీసుకున్న ప్రేషితోద్యమ పరమైన నిర్ణయాలను నిర్లక్ష్యంగా మరిచిపోవద్దు. అలా చేస్తే ఔట్రీచ్ సెంటర్స్, ఔట్రీచ్ సెంటర్స్‌గానే మిగిలిపోతాయి. పౌలు ఆ రోజుల్లో అన్ని ప్రాంతాలు తిరిగి సమస్తాన్ని నష్టపరుచుకొని సువార్తను గొప్ప లాభంగల పనిగా ఎంచుకున్నాడు. పౌలు లాంటి వ్యక్తులు మనలో ఉంటే ఔట్రీచ్‌లు ఇప్పటికీ ఉండి ఉండేవా? వెళ్ళగలిగితే మీరు తప్పక వెళ్ళండి. వెళ్ళ లేకపోతే వెళ్లే వారిని పంపండి. వెళ్తానని చెప్పి వెనకకు మరలకండి. పిలిచిన వాడు నమ్మదగినవాడు మనల్ని నమ్మి ఆ పని అప్పగించాడు. ప్రభువైన యేసుక్రీస్తు ప్రేషితోద్యమ సైన్యమునకు అధిపతిగా ఉండగా తండ్రి ఆశ నెరవేర్చడానికి పరిశుద్ధాత్ముడు వ్యూహకర్తగా వ్యవహరించే ఈ ప్రేషితోద్యమంలో ప్రేమను పంచడానికి వెళ్దామా లేక వెళ్ళేవారిని పంపుదామా?

– **వి కిషోర్ బాబు,** స్టాఫ్ కోఆర్డినేటర్, నంబూరు మిషన్స్ విభాగం నుంచి



# మిషన్స్

## ఒక ఎంపిక కాదు, బాధ్యత

భారత దేశంలోని ఏ మిషనరీ సంస్థ చరిత్ర చూసినా, యుఇయస్ఐ ఆనవాళ్ళు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కనబడతాయి. మన దేశంలోని ప్రాముఖ్యమైన మిషనరీ సంస్థల పుట్టుకలో యుఇయస్ఐ భాగస్వామ్యం వెల కట్టలేనిది. ప్రతి మిషనరీ సంస్థ వారిదగ్గర పనిచేయడానికి యుఇయస్ఐ సభ్యులనే కోరుకొంటున్నాయని అనడంలో ఏమాత్రం అతిశయోక్తి కాదు. మిషనరీస్‌గా వేరే సంస్థలలో, మిషనరీ విద్యార్థులుగా, టెంట్ మేకర్స్‌గా, స్టాఫ్‌గా, మన యుఇయస్ఐ సభ్యులు ఉత్తర భారత దేశంలోని సువార్త అందని రాష్ట్రాలలో, క్రైస్తవ మనుగడ, క్రైస్తవ సాక్ష్యం కష్టతరమైన ప్రాంతాలలో, ఎన్నో త్యాగాలతో విశేషమైన పరిచర్య చేస్తూనే ఉంది. యుఇయస్ఐ భారతదేశ మిషనరీ ఉద్యమ చరిత్ర పుటల్లో ఇంకా తనదైన ముద్రను వేస్తూ భావిభారతాన్ని ప్రభావితం చేస్తూనే ఉంది.

ఇటువంటి గొప్ప యుఇయస్ఐ పరిచర్యలో, యోగ్యతలేని మనలను పాలిభాగస్తులుగా చేసిన దేవాది దేవునికి మహిమా ఘనత యుగయుగములకు కలుగును గాక. మన నాల్గవ లక్ష్యంగా ఉన్న మిషన్స్ పట్ల మనకు మరింత అవగాహన కలిగేందుకు ఈ క్రింది విషయాలను మీతో పంచుకుంటున్నాను.

**మిషన్స్ పట్ల విద్యార్థులకు, గ్రాడ్యుయేట్స్‌కు ఉన్న అపోహలు ఏమిటి? అవగాహన కోసం ఏమి చేయాలి?**

**అపోహ:** నేను కొంత ధనాన్ని దేవుని సేవకు ఇస్తున్నాను, ఇది చాలు. ప్రపంచ సౌవార్తీకరణలో నా భాగం పూర్తయ్యింది అనుకొంటున్నాను.

**వాస్తవం:** దేవుని పరిచర్యకు ధనం ఇవ్వడం మంచిదే. ధనంతోపాటు మనం ఆయనకు అందుబాటులో (ఎవైలబిలిటీ) ఉండాలని, ఆరాధనతో (వర్షిప్) కూడిన, విధేయత (ఒబీడియన్స్) చూపించాలని కూడా దేవుడు కోరుకొంటున్నాడు. ఈ మూడు విషయాలు మనం నేర్చుకొంటున్నప్పుడు దేవుని చిత్త ప్రకారం మన పని, ప్రవర్తన, పరిచర్య ఉంటుంది.

**అపోహ:** మిషన్స్ కేవలం యువతకు లేక ప్రత్యేకించబడిన గొప్ప విశ్వాసులకు అంటే పాస్టర్స్‌కు మాత్రమేనా?

**వాస్తవం:** "దేవుని మిషన్స్ అనేది ఎంపిక చేసిన కొద్దిమందికి మాత్రమే కాదు, ప్రతి విశ్వాసికి సంబంధించినది. ప్రతి విశ్వాసి వారి పరిధిలో

**తప్పిపోయిన కుమారుని సన్నివేశంలో, పెద్దకుమారుడు తండ్రితో ఉన్నప్పటికి తండ్రి హృదయాన్ని బాధిస్తున్న విషయమేదో తెలుసు కోలేకపోయాడు.**

**ఉత్తర భారతదేశం పట్ల ఆయన ఆవేదనను ఆయనతో సన్నిహిత సంబంధాన్ని కల్గిన మనం అర్థంచేసుకొని ఆయన బాధలో పాలుపంచుకోవాలి.**

మిషనరీలుగా ఉండాలని దేవుడు పిలుస్తాడు" అని అంటాడు జాన్‌స్టాట్. ఎవరైతే దేవునికి అందుబాటులో ఉంటూ, ఆయనను ఆరాధిస్తూ, ఆయనకు విధేయత చూపిస్తూ, విశ్వాస జీవితంలో స్థిరత్వం, శిష్యత్వ అనుభవం కలిగి, త్యాగం చేయడానికి ఇష్టపడి, బైబిల్ జ్ఞానం కలిగిన ప్రతి ఒక్కరూ మిషన్స్ పరిచర్యలో పాలిభాగస్తులు అవ్వొచ్చు.

**అపోహ:** మిషనరీ పరిచర్య అంటే మారుమూల లేదా పర్వత ప్రాంతాలలో మాత్రమే చేసే పరిచర్య, నాకు భాష రాదు, క్రొత్త ప్రదేశం....?

**వాస్తవం:** మారుమూల లేదా పర్వత ప్రాంతాలతో పాటు, పట్టణ ప్రాంతాల్లో జీవిస్తున్న కోట్లాది మంది, ఇంకా యేసుక్రీస్తు గూర్చిన సమాచారం వారికి తెలియదు. వారి మధ్య పని చేసే సేవకులు లేరు. మనం దేవునికి అందుబాటులో ఉంటే ఆయన మనలను సన్నద్ధం చేస్తాడు, ఆయనకు లోబడితే దేవుడు మనల్ని ఎక్కడ వాడుకోవాలో అక్కడ వాడుకొంటాడు.

**అపోహ:** చాలా మంది క్రీస్తును ఎక్కడైతే ప్రకటించలేదో అక్కడ ప్రకటించడం కంటే, క్రైస్తవుల సహవాసంలో, దేవాలయంకు దగ్గరలో ఉంటే చాలు అనుకొంటారు.

**వాస్తవం:** మనం సువార్తను ప్రకటించిన వారి కే మరలా మరలా ప్రకటిస్తున్నాము, అధిక ధనాన్ని కూడా అక్కడే ఖర్చుపెడుతున్నాము. ఇప్పటి వరకు దేవున్ని గూర్చి ఒక్కసారి కూడా వినని వారి గురించి ఎప్పుడైనా ఆలోచించామా? ప్రార్థించామా? వారికి సువార్త అవసరం లేదా? ఎప్పటికీ సుఖవలయంలోనే ఉందామా?

దేవుని ప్రేషిత ఆజ్ఞను విస్మరించడం, అశ్రద్ధ చేయడం చాలా ప్రమాదకరం. ఆదిమ అపోస్త లులు, స్వయాన యేసుక్రీస్తు ద్వారా ఆజ్ఞను పొంది (అపొ. కా1:8), సహవాస మాధుర్యాన్ని యెరుషలేములోనే ఉండి అనుభవించడానికి ఇష్ట పడి దేవుని ఆజ్ఞను అశ్రద్ధ చేశారు. తర్వాత శ్రమలు కలగడం ద్వారా, స్తెఫను మరణం (అపొ.కా. 8:2) ద్వారా దేవుడు సువార్తను యెరూషలేము, యూదయ, సమరయ, దేశములందంతట, భూదిగంతములవరకు వ్యాపింప చేసినట్లు మనం చూస్తాము.

**అపోహ:** నేను ఇయు విద్యార్థిని / ఇజియఫ్ గ్రాడ్యుయేట్‌ని. నాకు మిషన్స్‌తో పనేంటి? మిషన్స్- మిషనరీలకు కదా?

**వాస్తవం:** యుఇయస్‌ఐ విజన్, మిషన్, లక్ష్యాల ను మన పెద్దలు గ్రేట్ కమిషన్ నుంచే స్వీకరించారని సుస్పష్టంగా అర్థమవుతుంది. మన యుఇయస్‌ఐ నాలుగు లక్ష్యాలు, ఒక భవనానికున్న నాలుగు స్తంభాలు లాంటివి లేక వాహనానికున్న నాలుగు చక్రాలు లాంటివి. అన్ని స్తంభాలు బలంగా ఉండాలి / అన్ని చక్రాలు కలిసి నడవాలి. కాబట్టి సమూహంగా, వ్యక్తిగతంగా ప్రతి ఇయు సభ్యుడు, ఇజియఫ్ గ్రాడ్యుయేట్ ఈ లక్ష్యాలను నెరవేర్చాలి.

ప్రతి ఇయు విద్యార్థి తమ క్యాంపస్‌లో మిషనరీగా, ప్రతీ ఇయు ప్రేషిత నివాసము (మిషన్ స్టేషన్) గా, ప్రతి ఇజియఫ్ ప్రేషిత సహాయ కేంద్రం (మిషన్ సపోర్ట్ సెంటర్) గా ఉండాలి.

**అపోహ:** నేనేమీ బైబిల్ కాలేజ్‌కి వెళ్ళలేదు, ఇక్కడ ఏదో ఒక ఉద్యోగం చేసుకొంటున్నాను. మిషనరీ పరిచర్య నాకు సాధ్యం కాదు.

**వాస్తవం:** మిషనరీ పరిచర్యలో పాల్గొనడానికి బైబిల్ మొత్తం కంఠస్థం చేయవలసిన అవసరం లేదు. దేవుడు ఎవరినైనా పిలిస్తే వారిని సన్నద్ధం చేస్తాడు. దేవునికి, సెమినరీకి వెళ్ళిన వారితో పాటు, ఉపాధ్యాయులు, ఇంజనీర్స్, జీవశాస్త్ర వేత్తలు, అకౌంటెంట్స్, డాక్టర్స్, నర్స్‌లు, ప్రసారకులు, సైనికులు మొదలైన అన్నిరంగాలకు చెందిన వారు మిషనరీ పరిచర్యకు అవసరం. ఏ రంగంలో పనిచేసేవారు ఆ రంగంలోని వారికి దేవున్ని పరిచయం చేయవచ్చు.

"సువార్త అనేది అనుభవించడానికి మాత్రమే కాదు,

వ్యక్తీకరించబడాలి. ప్రతి క్రైస్తవుడు మిషనరీగానైనా ఉండాలి లేదా మోసగాడుగానైనా ఉండాలి" అని చార్లెస్ స్పర్జన్ అంటాడు.

**అపోహ:** నేను మిషన్స్ రిట్రీట్స్‌కు గానీ, యస్‌యంటిసికి గానీ హాజరైతే ఒక వేళ దేవుడు నన్ను పూర్తికాల సేవకు పిలుస్తాడేమో?

**వాస్తవం:** ఇటువంటి భయ అవసరం లేదు. ఎందుకంటే, దేవుడు అందరినీ పూర్తికాల సేవకు పిల వడు. అయితే ప్రతి ఒక్కరూ తమ జీవితంలో దేవుని చిత్తమేదో తెలుసుకొని దానిని జరిగించాలి. ఒకవేళ ఆయన మిషనరీ పరిచర్య కోసం పిలిస్తే అన్ని విధాలుగా తర్ఫీదుని ఇస్తాడు. ఈ భూమి మీద మన జీవితాలు ఎంత స్వల్ప కాలమో కోవిడ్-19 మనకు గొప్పపాఠం నేర్పింది.గనుక మనకున్న ఒకే ఒక్క కొద్ది జీవితం ద్వారా దేవుని చిత్తం నెరవేర్చడం, ఆయన్ను మహిమపరచడమే గురిగా కలిగి ఉండాలి.

మన రాష్ట్రంలో తొంభై శాతానికిపైగా క్రీస్తుని అంగీకరించని వారు ఉన్నారు. వారికి పరిచర్య చేయుడానికి మన పాత్రేమిటో తెలుసుకొని పనిచేయాలి.

**అపోహ:** ఇక్కడే ఉంటూ, మిషనరీ పరిచర్యలో పాలిభాగస్తులం అవ్వడం అసాధ్యం.

**వాస్తవం:** ఇక్కడే ఉంటూ, మిషనరీ పరిచర్యలో పాలిభాగస్తులం అవ్వడం సాధ్యం కాదు అని అనుకోకూడదు. మనం ఇక్కడే ఉంటూ ప్రపంచవ్యాప్తంగా జరుగుచున్న మిషనరీ పరిచర్య వివరాలు సేకరించి వారికోసం క్రమం తప్పకుండా ప్రార్థించవచ్చు. అలాగే మిషనరీ పరిచర్యకు వెళ్ళేవారిని సిద్ధపరచి పంపవచ్చు. ఆర్థికంగా సహాయం చేయువచ్చు. ఫోన్‌ద్వారా వారిని పలకరించి ప్రోత్సహించవచ్చు.

అలాగే మన పూర్వ ఇయు విద్యార్థులు, ఇప్పుడు ఎక్కడ ఏమి చేస్తున్నారో తెలుసుకోవచ్చు. ఒకవేళ వారు త్యాగపూరితంగా మిషనరీ విద్యార్థిగా గానీ, టెంట్ మేకర్‌గా గాని, వెళ్ళినట్లయితే వారికోసం ప్రత్యేక ప్రార్థనా సహకారాన్ని అందించవచ్చు. మిషనరీ పరిచర్యలో నిమగ్నమైనంత మాత్రాన, వారేమీ భౌతిక అవసరతలకు అతీతులు కారు. వారు కూడా మనవలె అనేక అవసరాలను కలిగి ఉంటారని గ్రహించి వారికి ప్రతివిషయంలోనూ సహాయసహకారాలు అందించడానికి ఎల్లప్పుడు సిద్ధంగా ఉండాలి. అలాగే మిషనరీ బయోగ్రఫీలు చదవడం, మిషన్స్ రిట్రీట్‌లకు హాజరవ్వడం ద్వారా ఈ పరిచర్య గురించి మరింత ఎక్కువగా తెలుసుకోవచ్చు.

## యస్వీపి (స్టూడెంట్ వాలంటీర్ ప్రోగ్రామ్), జీవీపి (గ్రాడ్యుయేట్ వాలంటీర్ ప్రోగ్రామ్) అంటే ఏమిటి?

విద్యార్థులు/ గ్రాడ్యుయేట్స్ స్వచ్ఛందంగా జీవితంలో కొంత కాలం విభిన్న సంస్కృతి గల ప్రజల గుంపుతో పాటు, అనుభవం కలిగిన మిషనరీతో ఉండి అక్కడ విషయాలు తెలుసుకోవడానికి నిర్దేశించబడిన కార్యక్రమం. దీనికి ఇతర రాష్ట్రాల్లో మిషన్స్ పరిచర్య చెయ్యాలి అనే భావన కలిగిన విద్యార్థులు మరియు గ్రాడ్యుయేట్స్ వెళ్ళవచ్చును. అలాగే దేవుని పిలుపును నిర్ధారించుకోవడానికి, ఈ రెండు కార్యక్రమాలు ఉపయోగపడతాయి.

## షార్ట్‌మిషన్స్ ఎక్స్‌పోజర్ ట్రిప్ అంటే?

విద్యార్థులు / గ్రాడ్యుయేట్స్ ఎవరైనా ఉత్తర భారత దేశంలో ఉండే ప్రాంతాల్లో పరిచర్య స్థితిగతులు తెలుసుకోవడానికి రెండు వారాల పాటు ఏర్పాటు చేసిన ట్రిప్. ఈ షార్ట్ మిషన్స్ ట్రిప్‌లో అక్కడి విషయాలు అక్కడున్న స్టాఫ్ గాని, టియంఐ సభ్యులు గానీ తెలియజేస్తారు. కొత్తవారికి మిషన్స్ మీద అవగాహనకు ఇవి ఎక్కువగా ఉపయోగపడతాయి.

ఈ కార్యక్రమాలకు హాజరవ్వాలనుకొనేవారు యుఇయన్ఐ-ఏపి మిషన్స్ డిపార్ట్‌మెంట్‌కు తెలియజేయాలి. మిషన్స్ డిపార్ట్‌మెంట్ వారు వీరందరిని ఒక గుంపుగా చేసి, సెలవుల సమయంలో అందరూ కలసి ఆయా ప్రదేశాలను సందర్శించి, అక్కడ పరిచర్య లేని ప్రాంతాలలో ప్రార్థన చేసి,



అక్కడి పరిస్థితులను అర్థం చేసుకొనేలా ప్రణాళిక రూపొందించి పంపుతారు. తద్వారా భవిష్యత్తులో ఆ ప్రదేశం గురించి ప్రార్థించుటకు, ఒకవేళ దేవుడు పిలిస్తే ఆ ప్రాంతానికి వెళ్ళడానికి ఉపయోగపడుతుంది. వీటికి హాజరైన తర్వాత మన స్థానిక పరిచర్యలో చురుకుగా కూడా పాల్గొనే అవకాశం ఉంది.

**మిషనరి విద్యార్థులుగా, టెంట్ మేకర్స్‌గా వెళ్ళేటట్లు ప్రతి ఇయు, ఇజియఫ్ ఎందుకు ప్రోత్సహించాలి?**

తప్పిపోయిన కుమారుడు సన్నివేశంలో, పెద్దకుమారుడు తండ్రితో ఉన్నప్పటికి తండ్రి హృదయాన్ని బాధిస్తున్న విషయమేదో తెలుసు కోలేకపోయాడు.

ఉత్తర భారతదేశం పట్ల ఆయన ఆవేదనను ఆయనతో సన్నిహిత సంబంధాన్ని కల్గిన మనం అర్థంచేసుకొని ఆయన బాధలో పాలు పంచుకోవాలి. మనం ఆయనకు విధేయత చూపించినప్పుడు ఆయన మనలను బట్టి సంతోషిస్తాడు. ప్రీమియర్ విద్యా సంస్థల్లో గాని, మరే ఇతర సంస్థలలో గాని సీటు సాధించి, వెళ్ళి మన కోర్స్ పూర్తయ్యేసరికి ప్రార్థన చేసి ఒక్క బైబిల్ స్టడీ అయినా ప్రారంభించేటట్లు పయనీరింగ్ పరిచర్య చేయడానికి విద్యార్థులు సిద్ధపడాలి, ఇయులు, ఇజియఫ్‌లు విద్యార్థుల్ని, యంగ్ గ్రాడ్యుయేట్స్‌ని సిద్ధపరచాలి. అందుకే అందరం ఒక్కసారైనా ఉత్తర భారత దేశానికి వెళ్ళి పరిస్థితుల్ని గమనిద్దాం. "ఏ విషయాలయితే దేవుని హృదయాన్ని బ్రద్దలు చేస్తాయో, ఆ విషయాలు నా హృదయాన్ని బ్రద్దలు చేయునుగాక" అని వరల్డ్ విజన్ వ్యవస్థాపకుడు బాబ్ పియర్స్ అంటాడు. ఉత్తర భారతదేశ పరిస్థితుల్ని చూస్తే మనకు కూడా అలాంటి భారాన్ని దేవుడు ఇస్తాడు.

భారత దేశ విద్యార్థుల రక్షణ కోసం యుఇయస్ఐని దేవుడు ఎన్నుకొన్నాడు. దేశానికి వెన్నెముకైన ఈ విద్యార్థి సమూహాలను దేవునితో సంధి చేకూర్చి, శిష్యులుగా తర్ఫీదు చేసి, సంఘానికి, సమాజానికి సేవ చేయడమే మన దర్శనం. కాబట్టి, భారత దేశంలో ఉన్న ప్రతి విద్యార్థి కొరకు మనం భారం కలిగి ఉండాలి. మిషన్స్ ఒక ఎంపిక కాదు కానీ బాధ్యత అని మనం ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి.

**– డా. రాజశేఖర్,** వైజాగ్

కవిత



# మంచి పేరు, చెడ్డ తీరు

అతని పేరు వినయుడు
అద్వితీయుడు చెప్పిన మాటలు
అస్సలు వినడు
అపవాది చెప్పే మాటలు వింటాడు.
అవసరమైన వాటిపై విసుక్కొంటాడు
అనవసరమైనవి విడువడు.
పరిశుద్ధతకు విముఖుడు
పాప పరిహాసంలో విద్వాంసుడు.
తుచ్ఛ వివాదాల్లో విజ్ఞానుడు
స్వచ్ఛ విధానాల్లో విపక్షుడు.
కావాల్సిన వాటిని కాలదన్నుతూ
పోవాల్సిన వాటిని పెట్టి పోషిస్తూ
యోగ్యమైన వాటిపై యోచన లేకుండా
భాగ్యమైన వాటిపై భావన రాకుండా
ఆరోగ్యవంతుడనని అనుకొంటూ
వైరాగ్యరహితుడననే చెప్పుకొంటూ
విజ్ఞానకాలంలో అజ్ఞానిగా
అర్థవంతమైన జీవితాన్ని
అర్థహీనంగా జీవిస్తూ ఉంటాడు

చివరకు, వినయుడు విజయవంతంగా
వినాశనాన్ని తెచ్చుకొన్నాడు

**– నవీన్ రాజు,** స్టూడెంట్, బాపట్ల

# జీవితానికి పునాదులు, ప్రణాళికలను ఆయనే వేస్తాడు



నా పేరు కోటేశ్వరరావు (కోటి). మాది పల్నాడు జిల్లా, అచ్చంపేట మండలంలోని చిగురుపాడు గ్రామం. నేను ఒక నామకార్థ క్రైస్తవ కుటుంబంలో జన్మించాను. నా విద్యాభ్యాసం పదవ తరగతి వరకు అచ్చంపేట, సత్తెనపల్లిలో జరిగింది. ఇంటర్ చదవడానికి తెనాలి వెళ్ళాను.

నేను ఇంటర్ మొదటి సంవత్సరంలో నా తోటి విద్యార్థులతో కలసి బాపట్లలో జరుగుతున్న ఇవాంజిలిస్టిక్ క్యాంప్‌కు హాజరయ్యాను. మొదటి రెండు రోజులు నాకేమీ అర్థంకాలేదు. కానీ రెండవ రోజు సాయంత్రం డివోషన్‌లో “దేవునితో వ్యక్తిగత సంబంధం” (యోహాను 8:32) గురించి మాట్లాడారు. ఆ తరువాత 2/2 లోను, ఫ్యామిలీ ప్రేయర్‌లోను ఇవే విషయాలు మాట్లాడుతుంటే, “మాది క్రైస్తవ కుటుంబం, నాకు రక్షణ అవసరం లేదు, నేను చిన్నప్పటినుంచి చర్చ్‌కి వెళుతున్నాను” అని వారితో వాదనకు దిగేవాడిని. ఆ తరువాత వారు చెప్పేది శ్రద్ధగా విని ఆలోచించి క్యాంప్ చివరి రోజు 13 ఆగస్ట్ 2010న యేసుక్రీస్తును నా స్వంత రక్షకునిగా అంగీకరించాను.

ఆ తర్వాత తెనాలి ఇయుకు వెళ్ళడానికి నాకు చాలా కాలం పట్టింది. నన్ను బైబిల్ స్టడీకి తీసుకెళ్ళడానికి సీనియర్స్, జూనియర్స్ చాలా ప్రయాస పడ్డారు. ఆ తర్వాత క్రమంగా, ఆసక్తిగా వెళ్ళేవాడిని. ఒక సంవత్సరం తర్వాత ఇయు కమిటీలో బాధ్యతలు అప్పగించారు. సీనియర్ అడ్వయిజర్స్‌గా ఉన్న మార్క్ అన్న, ప్రియదర్శిని అక్క నా ఆత్మీయ ఎదుగుదలకు, కమిటీలో చురుకుగా పాల్గొనడానికి కావలసిన విషయాలను ఎంతో చక్కగా నేర్పించారు. అలాగే మిగిలిన గ్రాడ్యుయేట్స్ అందరూ నాకు చాలా దగ్గరై నన్ను ఎంతో ప్రేమగా చూసుకొనేవారు.

ఒకప్పుడు నేను ఎంతో సిగ్గు, బిడియంతో ఉండేవాడిని. నా వ్యక్తిగత విషయాలేవీ ఇతరులతో పంచుకోవడానికి ఇష్టపడేవాడిని కాదు. కానీ యంపిసి, మెంటరింగ్ నాకు ఎంతో ఉపయోగపడ్డాయి. నాకు చిన్నప్పుడే కంటిలో కాటరాక్ట్ సమస్య ఉంది. అందువల్ల ప్రాథమిక విద్య సమయం లోనే ఆపరేషన్ జరిగినా సరైన ఫలితం రాలేదు. దానివల్ల చదువంటే ఎంతో ఇష్టం ఉన్నా చదవడానికి చాలా కష్టపడాల్సివచ్చేది. ఒక రోజు గౌరక్క నాతో మాట్లాడుతూ నన్ను గమనించి నా సమస్య గురించి అడిగి తెలుసుకొని చాలా బాధపడ్డారు. నేను ఇంటర్, డిగ్రీలో చదవడానికి మైక్రోస్కోప్ ఉపయోగించడం వలన డిగ్రీ చివరలో నాకంటి సమస్య మరీ ఎక్కువైంది. ఆ సమయంలో ఆంధ్ర, తెలంగాణలలో చాలా హాస్పటల్స్‌కు ఒంటరిగా తిరిగాను. అందరూ నీకు చూపు తిరిగి రాదని అన్నారు. కానీ నేను విశ్వాసంతో ప్రార్థించి ఎందరినో సంప్రదించి తమిళనాడులోని మధురైకి వెళ్ళాను. అక్కడ వాళ్ళు పదిరోజులు టెస్ట్‌లు చేసి అర్జంట్‌గా రేపు ఉదయమే ఆపరేషన్ చేయాలని చెప్పి, దానికి అవసరమైన ఖర్చు గురించి, ఏవిషయంలోనూ టెన్షన్ పడకూడదని చెప్పారు. కానీ నా దగ్గర చాలా తక్కువ అమౌంట్ మాత్రమే ఉంది. ఏంచేయాలో తోచలేదు. డబ్బులు లేక తిరిగి ఆంధ్రాకు వెళ్ళాలని నిర్ణయించుకొని హాస్పిటల్ నుంచి రూమ్‌కి వెళ్ళి ప్రేయర్ చేసుకొని పడుకొని ఉదయాన్నే నాలుగు గంటలకు లేచి క్వైట్‌టైమ్ కీర్తనలు 121:1–8 చేసుకొన్నాను. ఐదు గంటలకు యల్‌టి క్యాంప్‌లో ఉన్న గౌరక్క ఫోన్‌చేసి నా ఆపరేషన్ గురించి అడిగి తెలుసుకొని అవసరమైన డబ్బును పంపారు. అప్పుడు దేవుని యొక్క అద్భుత సహాయాన్ని చూడగలిగాను.

నేను ఆపరేషన్‌కి వెళ్ళడానికి సిద్ధమవుతూ నాకు రాబోయే చూపు గురించి, పిజి చదవాలని ఊహించుకొని వెళ్ళాను. ఆపరేషన్ జరిగింది కానీ అది ఫెయిల్ అయ్యి రెండు రోజులు చాలా ఇబ్బంది పడ్డాను. చూడటానికి కూడా వీలు పడలేదు. ఆ సమయంలో డాక్టర్స్ స్పెషల్ కేస్ అని ఒక ఐడి కార్డ్ నా మెడలో వేసి నన్ను పక్కన ఉంచారు. ఆ సమయంలో భరించలేని నొప్పితో బెడ్ మీద పడుకొని ఇలా ప్రార్థించాను "ప్రభువా దయచేసి నాకు మంచి చూపును అనుగ్రహించండి, దానితో మీరు ఎక్కడికి పంపితే అక్కడకు వెళ్ళి నిస్వార్థంగా మీ సేవ చేస్తాను ఇక చదవను" అని ఏడుస్తూ ప్రార్థిస్తుండగా అప్పుడే ఒక స్పెషలిస్ట్ డాక్టర్ వచ్చి ఆపరేషన్ చేశాడు. ఆ తరువాత మంచి ఫలితం వచ్చింది. ఆ డాక్టర్ నన్ను చాలా జాగ్రత్తగా ఉండాలని, చదువు గురించి ఆలోచన చేయవద్దని చెప్పారు. దేవునితో నేను చేసుకొన్న తీర్మానాన్ని ఎవరితోనూ పంచుకోలేదు.

మూడు నెలల తర్వాత పిజి చేయడానికి ఎన్నో ప్రయత్నాలు చేశాను. కొన్నిరోజులు బైబిల్ చదవడం, క్వైట్ టైమ్ మానేసి ఎవరితోనూ కాంటాక్ట్‌లో లేను. కోచింగ్‌లో కూడా చేరాను, కానీ నెమ్మది లేదు. ఆ టైమ్‌లో తెనాలి సీనియర్ అడ్వయిజర్‌గా ఉన్న జయశ్రీ అక్క నన్ను తెనాలి గ్రాడ్యుయేట్ హెల్పర్‌గా రమ్మని ఎన్నోసార్లు కాల్ చేశారు. గానీ నాకు కుదరదని చెప్పాను. కానీ వారు క్రమం తప్పకుండా నాకోసం ఎంతో ప్రేయర్ చేశారు. ఆ సమయంలో ఒకరోజు బైబిల్ చదువుచుండగా దేవుడు తన పిలుపు గురించి 2 తిమోతి 2 :1-8 ద్వారా మాట్లాడుతూ "నా కుమారుడా, క్రీస్తుయేసు నందున్న కృపచేత బలవంతుడవుకమ్ము. నీవు అనేక సాక్షుల యెదుట నా వలన వినిన సంగతుల ను ఇతరులకును బోధించుటకు సామర్థ్యము గల నమ్మకమైన మనుష్యులకు అప్పగింపుము. క్రీస్తుయేసు యొక్క మంచి సైనికుని వలె నాతో కూడా శ్రమను అనుభవించుము. సైనికుడెవడును యుద్ధమునకు పోవునప్పుడు తన్ను దండులో చేర్చుకొనిన వానిని సంతోషపెట్టవలెనని ఈ జీవన వ్యాపారములలో చిక్కుకొనడు. జెట్టియైనవాడు పోరాడునప్పుడు, నియమప్రకారము పోరాడకుంటే వానికి కిరీటము దొరకదు. పాటుపడిన వ్యవసాయకుడే మొదట ఫల ములలో పాలుపుచ్చుకొనవలసిన వాడు. నేను చెప్పు మాటలు ఆలోచించుకొనుము; అన్ని విషయముల యందు ప్రభువు నీకు వివేకమనుగ్రహించును". ఒక్కసారిగా నా దృష్టి "నేను చెప్పు మాటలు ఆలోచించుకొనుము అన్ని విషయములయందు ప్రభువు నీకు వివేకమనుగ్రహించును" అనే మాట మీదకు మళ్ళింది. ఈ భాగాన్ని ధ్యానిస్తుండగా ప్రభువు పిలుపు గురించి ఎంతో భయం వేసి దేవుని మాటకు విధేయత చూపాలని నిర్ణయించుకొని గ్రాడ్యుయేట్ హెల్పర్‌గా చేరాను. అలా చేస్తున్నప్పుడు దేవునిమీద ఆధారపడడం, విశ్వాసాన్ని అభ్యాసం చేయడం వంటి విషయాలు నేర్చుకొన్నాను.

ఆ టైమ్‌లోనే గౌరక్క నన్ను ప్రోత్సహించి 2016లో నంద్యాలలో జరిగిన యస్‌యంటిసికి పంపారు. అక్కడ దేవుడు నాతో నార్త్ ఇండియా పరిచర్య గురించి మాట్లాడుచున్నాడు కానీ నేను చాలా భయంతో స్పందించకుండా ఉన్న టైమ్‌లో సునీత అక్క కాల్ చేసి క్యాంప్‌లో ప్రేయర్ ఫుల్‌గా పాల్గొంటూ, దేవుడు మాట్లాడే ప్రతిదీ నోట్స్ రాయాలని చెప్పి ఫోన్‌లోనే ప్రేయర్ చేశారు. ఆ తరువాత నేను నా భవిష్యత్‌ను దేవుని చిత్తానికి అప్పగించాను. యస్‌యంటిసి తరువాత నార్త్ ఇండియాకు యుఇయస్‌ఐ-ఏపి మిషన్స్ డిపార్ట్మెంట్ వారు నిర్వహించిన 'మిషన్ ఎక్స్‌పోజర్ ట్రిప్' కు నేను పంజాబ్‌కు, ఆ తరువాత గౌరక్క ప్రోత్సాహంతో ఉత్తరాఖండ్‌కు వెళ్ళాను. నార్త్ ఇండియాలో పరిస్థితులు గమనించి భయపడి ఇయు పరిచర్య నాకు సెట్ కాదని, తగిన స్కిల్స్ లేవని చర్చ్ మినిస్ట్రీకి వెళ్ళాలనీ అది కూడా హెబ్రోన్‌లోనే సేవ చేయాలని ఎన్నో ప్రయత్నాలు చేశాను గానీ సాధ్యపడలేదు. ఆ టైమ్‌లోనే నాగురించి తెలుసుకొన్న అప్పటి యుఇయస్‌ఐ నేషనల్ ట్రైనింగ్ డిపార్ట్మెంట్ సెక్రెటరీ జాకబ్ వర్గీస్ గారి ద్వారా గ్రాడ్యుయేట్ వాలంటరీ ప్రోగ్రామ్(జివిపి)కు ఐఇయం అరకు ఫీల్డ్‌కు వెళ్ళాను. వెళ్ళిన కొత్తలో అక్కడి ప్రజల జీవన విధానం చూసి వారితో కలసిపోవడానికి, వారి ఆహారపు అల వాట్లు నేర్చుకోవడానికి నాకు చాలా కష్టమైంది. అయినా మూడు నెలలు అక్కడే ఉండి పరిచర్య చేయడానికి దేవుడు ఎంతో కృప చూపాడు. తర్వాత చర్చ్ పరిచర్యకే వెళ్ళాలని నిర్ణయించుకున్నాను కానీ దేవుడు మాత్రం పంజాబ్ గూర్చి, అక్కడి పని గూర్చి స్టాఫ్ అవసరత గూర్చి నాతో మాట్లాడుతూనే ఉన్నాడు. నాలో ఇయు పరిచర్యా? చర్చ్ పరిచర్యా? అని ఏదో తెలియని అలజడి మాత్రం అలానే ఉంది.

జివిపి తర్వాత స్టడీ సెంటర్ కోటగిరికి రావాలని జాకబ్ వర్గీస్ గారు కోరారు. దానితో నేను కోటగిరి వెళ్ళాను. అక్కడ ఒకరోజు "క్వైట్ డే" రోజున "ప్రభువా దయచేసి నా ఫ్యూచర్ గురించి నాతో క్లియర్‌గా వాక్యం ద్వారా మాట్లాడమని" ప్రార్థన చేశాను. ఆ రోజు మధ్యాహ్నం పరిశుద్ధాత్మని ప్రేరేపణతో బైబిల్ తీసి సామెతలు 16వ అధ్యాయం చదువుతుండగా దేవుడు నాతో ఈవిధంగా మాట్లాడాడు 16:3లో 'నీ పనుల భారము యెహోవా మీద నుంచుము, అప్పుడు నీ ఉద్దేశములు సఫలమగును". వెంటనే ప్రార్థన చేసుకొని పంజాబ్ వెళ్ళాలని నిర్ణయించుకొని తర్వాత రోజు జాకబ్ వర్గీస్ గారితో షేర్ చేశాను. తరువాత మా తెనాలి ఇయు, ఇజియఫ్‌కు, పంజాబ్ వాళ్ళకు కూడా చెప్పి 01 డిసెంబర్ 2019న పంజాబ్ కు వెళ్ళి ఇప్పుడు ఇక్కడే యుఇయస్ఐ-పంజాబ్ స్టాఫ్‌గా పరిచర్య చేస్తున్నాను. యుఇయస్ఐ-ఏపి మిషన్స్ డిపార్ట్‌మెంట్, తెనాలి ఇజియఫ్ వారు కోవిడ్ సమయంలో ఎంతో ఆర్థికంగా సహాయం చేశారు. వారికి నా కృతజ్ఞతలు.

20 జూన్ 2022న నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు చెందిన మెర్సీతో వివాహమైంది. మా వివాహంలో దేవుని చిత్తాన్ని చేయడానికి దేవుడు కృప చూపించాడు. మా వివాహ విషయంలో తెనాలి, అచ్చంపేట, క్రోసూరు, కర్నూల్, నంద్యాల, ఆళ్లగడ్డ, పంజాబ్‌లకు చెందిన ఇయు అన్నలు, అక్కలు మాకు పెద్దలుగా ఉండి ఎంతో సహాయం చేశారు. వారి ప్రేమ ప్రయాస నిజంగా ఎప్పటికీ మర్చిపోలేము. మాకు ఇప్పుడు ఒక పాప జానెట్.

యేసు ప్రభుని స్వంత రక్షకునిగా అంగీకరించినప్పటి నుండి ఇప్పటివరకు తెనాలి గ్రాడ్యుయేట్స్ నాకు ప్రార్థనా జీవిత ప్రాముఖ్యత, దేవునిమీద ఆధారపడడం లాంటి అనేక ఆత్మీయ విషయాలు నేర్పించారు. ఒక కుటుంబ సభ్యుడిగా చూస్తూ, అన్ని పరిస్థితుల్లో నాకు సహాయంగా ఉన్నారు. ఇంత మంచి కుటుంబాన్ని నాకిచ్చినందుకు నేను దేవునికి కృతజ్ఞతలు చెల్లిస్తున్నాను.

దేవుడు మాట్లాడుతున్నప్పుడు సంపూర్ణ విధేయత చూపించినప్పుడు, నా జీవితాన్ని ఆయన చేతులకు అప్పగించినప్పుడు నా జీవితానికి కావాల్సిన ఆత్మీయ, పరిచర్య పునాదులను, ప్రణాళికలను ఆయనే వేశాడు. నా జీవితం ద్వారా ఆయనకే మహిమ కలుగునుగాక.

మా కుటుంబం ఆయన పని నిమిత్తం బాగా ప్రయాసపడేటట్లు, పంజాబ్ పరిచర్య కొరకు ప్రార్థనచేయాలని మిమ్ములను హృదయ పూర్వకంగా వేడుకొంటున్నాను.

**– కోటేశ్వరరావు,** పంజాబ్ స్టాఫ్

కవిత

# గతంలోకి చూస్తే...




గడిచాయి గడిచాయి ఎన్నో శ్రమలు
వచ్చాయి వచ్చాయి మరెన్నో శోధనలు
చుట్టుముట్టాయి ఇంకెన్నో భయాలు
పట్టి వేధించాయి ఎన్నెన్నో రోగాలు
ఎదురయ్యాయి ప్రతిదినం ఎన్నో ప్రమాదాలు
వెంబడించాయి దినదినం సమస్యలు
అనుసరించాయి అనుదినం ఇబ్బందులు
దాటిపోయాయి అడుగడుగునా అపజయాలు

తలంచుదామా ఆయన చేసిన ఉపకారములు
లెక్కించుదామా ఆయన చేసిన మేళ్ళు
గుర్తించుదామా ఆయన నమ్మదగిన దేవుడని
ఆదరణ పొందుదామా ఆయన మెల్లని స్వరముతో
అందుకుందామా ఆయన ఆశీర్వాదాలు
అనుభవించుదామా ఆయన సాన్నిధ్యము
అర్పించుదామా! మన జీవితాలను
సమర్పించుదామా!! సజీవయాగాలుగా

**– డా॥ వి. ఇశ్రాయేలు రాజు,** వైజాగ్

# ఆయన పనికి సెలవులేదు




ఆయన్ను 'న్యూ గినియా లివింగ్‌స్టోన్' అని అంటారు. గొప్ప అన్వేషకుడు. ఎవ్వరూ కాలు పెట్టని ప్రాంతాలను ప్రభువు కోసం గెలవడంలో దిట్ట. ప్రపంచ ప్రేషిత సేవలో ఆణిముత్యం. ఇంగ్లాండ్ గడ్డమీద పుట్టిన మిషనరీలందరిలో ఘనుడిగా ఎంచబడినవాడు. నరమాంస భక్షకుల మధ్య సింహము వలె నిలబడి క్రీస్తు కోసం గెలిచిన యోధుడు. సాహసానికి మరోపేరు. ప్రభువు యొక్క మహాసైన్యములో గొప్ప యోధుడు ... ఆయనే జేమ్స్ చాల్మర్స్.

జేమ్స్ చాల్మర్స్ 1841 ఆగష్టు 4న స్కాట్లాండ్‌లో జన్మించాడు. తండ్రి రాతి పనిచేసుకొనేవాడు. తల్లిదండ్రుల భక్తి ప్రభావం జేమ్స్ మీద చాలా ఉంది. చిన్నతనంలోనే అతని సాహసం, ధైర్యం వెలుగు చూశాయి. 10వ యేట ఒక అబ్బాయి మునిగిపోతుంటే అతనిని రక్షించాడు. ఒకసారి ఒక పత్రికలో ప్రచురించిన ఫిజి దేశపు మిషనరీ లేఖను సండే స్కూల్‌లో చదివి వినిపించాడు. నరమాంస భక్షకులు సువార్త శక్తి చేత మార్పు చెందుతున్నారని, అయితే వారికి సువార్తను ప్రకటించేందుకు ఇక్కడ ఎవరైనా ఉన్నారా? అని చెమర్చిన కళ్ళతో పాస్టర్ ప్రశ్నించాడు. ఆ క్షణంలోనే జేమ్స్ తన మనసులో దేవుని సహాయంతో నేను ఆ మిషనరీగా వెళతాను అని అనుకొన్నాడు. కానీ పరిస్థితులు ఆ నిర్ణయాన్ని మరుగున పడేలా చేశాయి.

జేమ్స్18వ యేట మారుమనసు పొందాడు. రక్షణ పొందిన వెంటనే క్రైస్తవ మీటింగ్స్‌లో విరివిగా వాక్యము చెప్పేవాడు. చెషంట్ కాలేజ్‌లో చేరిన తర్వాత తాను ఫిజికి మిషనరిగా వెళతానని తీసుకొన్న నిర్ణయం మరలా జ్ఞప్తికి వచ్చింది. ఆ విషయాన్ని పాస్టర్ మీక్లేకి చెబుతాడు. అప్పుడు అతనికి 21 సంవత్సరాలు.

అతనికి మిషనరీగా వెళ్ళాలనే భారం కలిగింది మాత్రం అతనికి 15 సంవత్సరాలు వయస్సు ఉన్నప్పుడు. తర్వాత అతనికి ఉన్నత చదువులు చదువుకొనే స్థోమత లేక తన సంఘంలో సండే స్కూల్ టీచర్‌గా చేరాడు. అక్కడ మీక్లే అనే పాస్టర్ ఎంతగానో బలపరచి అతనికి లాటిన్ నేర్పించాడు. అతనే జేమ్స్ చాల్మర్స్‌ని గ్లాస్కోసిటీ మిషన్స్ మరియు సంఘములో చేరమని సలహా ఇచ్చాడు. 1861వ సం॥లో ఇతను దాంట్లో చేరి ఆ పట్టణములో 8 నెలలు ప్రయాసపడ్డాడు. అక్కడ అతను నేర్చుకొన్న క్రమశిక్షణ అతనికి ఎంతగానో ఉపయోగపడింది. అతను సంఘములో పాస్టర్‌గా ఉండడం కొరకు, విశ్వవిద్యాలయంలో చదవడం కోసం సిద్ధపడుచూ ఉండగా టర్నర్ అనే వ్యక్తి యొక్క ప్రోద్భలంతో లండన్ మిషనరీ సొసైటీకి అప్లై చేస్తే వారు ఇతని అప్లికేషన్‌ని అంగీకరించారు. చెషంట్ కళాశాలను విడిచిపెట్టిన తర్వాత ఇతను మిషన్ ఫీల్డ్‌కు పంపించబోయే వ్యక్తుల ను సిద్ధపరచే ప్రదేశానికి వెళ్ళాడు.

అక్టోబర్ 17, 1865వ సం॥లో జేన్ హెర్కుస్‌తో వివాహం జరిగింది. అతను ఆమె గూర్చి మాట్లాడుతూ ఆమె పూర్ణహృదయంతో దేవుని సేవించే మిషనరీ అని అన్నాడు . ఆమె యొక్క సాహచర్యం అతను ఇంకా ఆసక్తితో ఫీల్డ్‌లో పని చేయడానికి సహాయపడినది. అతనికి వివాహమైన రెండు రోజుల తర్వాత అతను అభిషేకించబడ్డాడు. జనవరి 4, 1866వ సం॥లో వారు జాన్ విలియమ్స్ షిప్ ఎక్కి కొత్త ప్రదేశంలో పరిచర్య కొరకై ప్రయాణం ప్రారంభించారు.

## మిషనరీ పరిచర్య ప్రారంభం

1867సం॥ మే 20న భార్యాభర్తలు రారోటోంగాలో అడుగుపెట్టారు. అప్పటికి అక్కడి పరిస్థితులు అంత మంచిగా లేవు. అక్కడ ఉన్న ప్రజలు 50 సంవత్సరాల నుంచి క్రైస్తవులుగా పిలువబడుతున్నప్పటికీ ఇంకా భయంకరమైన జీవితాలను జీవిస్తున్నారు. తాగుడు వ్యసనం భయంకరంగా ఉండేది. వారిని సంస్కరించాల్సిన బాధ్యతను జేమ్స్ చాల్మర్స్ తన భుజాల మీద వేసుకొన్నాడు. అక్కడ ఉన్న స్థానిక బోధకులకు శిక్షణ ఇచ్చే సంస్థ యొక్క బాధ్యత ఇతని మీద పడింది. ఇక్కడి ప్రజలు అతని పేరును పలకలేక అతనిని 'టమాటే' అని పిలిచేవారు. తర్వాతి కాలంలో అదే పేరు అతనికి స్థిరపడిపోయింది. 'టమాటే' ప్రతి గ్రామానికి వెళ్ళి 'పీస్, పీస్' అని అరచుకొంటూ వెళ్ళేవాడు. అక్కడకు ఒకసారి బ్రిటీష్ గవర్నమెంట్ చేత పంపబడిన కమీషనర్ వచ్చి మీ రాజు ఎవరు అంటే 'టమాటే' అని వారు సమాధానము ఇచ్చారు. మీకు తండ్రి లాంటి వాడు ఎవరు అని అడిగితే 'టమాటే' అని వారు బదులిచ్చారు. జేమ్స్ చాల్మర్స్ అంతగా వారిని ప్రభావితం చేసి వారి గ్రామాల్లో గొడవలను రూపుమాపి, శాంతిని ఏర్పరచాడు.

## న్యూ గినియాలో పరిచర్య

జేమ్స్ చాల్మర్స్ యొక్క హృదయం ఎప్పుడూ కూడా నరమాంస భక్షక ద్వీపమైన న్యూ గినియా మీదనే ఉండేది. ఎందుకంటే ఆ ప్రాంతానికి అప్పటివరకూ ఒక్క మిషనరీ కూడా వెళ్లలేదు, ఒక్కరికీ కూడా సువార్త తెలియదు. అది చాలా భయంకరమైన ప్రదేశము కాబట్టి 21 అక్టోబర్ 1877లో న్యూ గినియాలోని పోర్ట్‌మోర్స్‌బిలో అడుగుపెట్టారు. న్యూ గినియాను చేరుకోవడానికి సరిగ్గా సరిపోయే ప్రదేశం కోసం అతను వెదకసాగాడు. అతను ఇలా అనేవాడు "నేను క్రీస్తుకు, ఆయన సిలువకు దగ్గరగా జరిగే కొలది, అన్యులకు లేదా రక్షణ పొందని వారికి మరింత దగ్గరగా చేరాలనే కోరిక నాలో పెరుగుతూ ఉంటుంది". 1000 మంది నివాసముండే పోర్ట్‌మోర్స్‌బి గ్రామం 'టమాటే' యొక్క ముఖ్య స్థావరం అయ్యింది. 'టమాటే' ఎక్కువగా పయనీరింగ్ వర్క్ చేయడానికి పూనుకొని ఆ ప్రాంతం అన్ని వైపులా ప్రయాణము చేయసాగాడు. మొదటి యాత్ర 10 వారాలపాటు కొనసాగింది. ఈ పదివారాల సమయంలో అతను వందల కొలది గ్రామాలను దర్శించాడు, పర్వత ప్రాంతాలలో ఉన్న ప్రజలను కూడా చేరుకొన్నాడు. ఈ అన్వేషణ యాత్రలో ఇతనితో పాటు రోరోటాంగా బోధకుడైన 'రువటోకా' ఉన్నాడు. అతను పరిశీలించిన తర్వాత న్యూ గినియా వారు ఇంకా అభివృద్ధికి నోచుకోలేదని గమనించాడు. ప్రాణ భయముతో అక్కడ ఉన్న స్థానికులందరూ తమ గ్రామ సరిహద్దుల ను దాటడానికి భయపడుతున్నారని, గ్రామాల మధ్య భయంకరమైన గొడవలు ఉన్నాయని గుర్తించాడు. అక్కడ అటవీకులు ఒకరి గూర్చిన భయంతో జీవించడం చాలా బాధాకరమైన విషయం. ఇతను వారికి "మీరు మీ శత్రువు పట్ల కనికరము చూపిస్తే వారు కూడా మీ మీద చూపిస్తారు" అని బోధించాడు. దాంతో అక్కడ అటవీకులు స్వేచ్ఛగా ప్రశాంతంగా నిద్రపోసాగారు. ప్రతి గ్రామంలోనికి 'శాంతి.. శాంతి..' అని కేకలు వేస్తూ వెళ్ళేవాడు. ఆ పదివారాల

> **ఒక వ్యక్తి వచ్చి 'తన భార్య చనిపోయిందనే' చిన్న పేపర్‌ని జేమ్స్ చాల్మర్స్ చేతిలో పెడతాడు. అది చూసిన తర్వాత జేమ్స్ చాల్మర్స్ ఇలా అంటాడు "నా దు:ఖాన్ని నా కోసం ప్రాణం పెట్టిన నా ప్రభువు పనిలో పాతిపెడతాను. ఆయన పనికి సెలవులేదు, నేను తప్పకుండా పనిచేయాలి. నేను ఇప్పుడు ఇంటికి తిరిగి వెళితే మిగతా బోధకుల, సేవకుల మీద చెడు ప్రభావము చూపుతుంది. వారు కూడా శ్రమను అనుభవించారు, వారిలో కొంతమంది తమ భార్యలను కోల్పోయారు, నేను వారితో తప్పని సరిగా ఉండాలి".**

తర్వాత 'మునికహిళా' అనే ప్రాంతానికి వచ్చి అక్కడ స్థిరమైన నివాసాన్ని ఏర్పాటు చేసుకొన్నాడు.

జేమ్స్ చాల్మర్స్ రెండవ ప్రయాణం రెండు నెలల పాటు సాగింది. పోర్ట్‌మోర్స్‌బి నుంచి ఈ ప్రయాణం ప్రారంభించాడు. ఈ యాత్రలో అతనితో పాటు బె స్విక్, పిరి అనే వారు, మరో ముగ్గురు స్థానిక బోధకుల ను కూడా తమతోపాటు తీసుకొని 'మైవా' అనే ప్రాంతానికి వెళ్ళారు. అక్కడికి వెళ్ళిన తెల్లవారిలో వీరే మొదటివారు. జోకియా, మోటుమోటు అనే ప్రాంతాలను సందర్శించారు. సిలో, పెసి, కేరామా, ఒరోకోలో.. ఈ ప్రాంతాలన్నిటిలో కూడా మిషనరీ పనిచేసి అనేకమందికి సువార్తను ప్రకటించాడు. ఫలితంగా అనేకమంది ప్రభువు దగ్గరకు వచ్చారు. జేమ్స్ చాల్మర్స్ వారి దగ్గరకు ఎటువంటి ఆయుధాలు లేకుండా వెళ్ళి వారి మధ్య నివశించి వారికి సువార్తను ప్రకటించేవాడు. మోటు మోటు అనే గ్రామంలో వారికి సాదరమైన స్వాగతము లభించింది.

అయితే జేమ్స్ చాల్మర్స్ యాత్ర పూర్తిగా జైత్రయాత్ర కాదు. అనేకసార్లు అక్కడ ఉన్న అటవీకులు వీరిని అనుమానించి శత్రువుగా భావించి వారి భూభాగాల్లోకి రానిచ్చేవారు కాదు. కరమా అనే ప్రాంతానికి వారు వెళ్ళినప్పుడు అక్కడ ఉన్న స్థానికులు ఆయుధాలతో వీరిని చంపడానికి వస్తారు. అక్కడ నుంచి దేవుడు వీరిని అద్భుతముగా రక్షిస్తాడు. వీరు సందర్శించిన వారిలో అనేకమంది నరమాంస భక్షకులు. జేమ్స్ చాల్మర్స్ ప్రపంచంలోనే క్రూరమైన నరమాంస భక్షకులైన పాపూయా అటవీకుల మధ్య జీవించాడు. అతని యొక్క భార్య ఆరోగ్యము రోజు రోజుకూ క్షీణిస్తున్న కారణాన్ని బట్టి ఆమె విశ్రాంతి, కోలు కోవడం కోసం సిడ్నీకి వెళ్ళి అక్కడ 20 ఫిబ్రవరి 1879న ఆమె చనిపోతుంది. ఒక వ్యక్తి వచ్చి 'తన భార్య చనిపోయిందనే' చిన్న పేపర్‌ని జేమ్స్ చాల్మర్స్ చేతిలో పెడతాడు. అది చూసిన తర్వాత జేమ్స్ చాల్మర్స్ ఇలా అంటాడు "నా దు:ఖాన్ని నా కోసం ప్రాణం పెట్టిన నా ప్రభువు పనిలో పాతిపెడతాను. ఆయన పనికి సెలవులేదు, నేను తప్పకుండా పనిచేయాలి. నేను ఇప్పుడు ఇంటికి తిరిగి వెళితే మిగతా బోధకుల, సేవకుల మీద చెడు ప్రభావము చూపుతుంది. వారు కూడా శ్రమను అనుభవించారు, వారిలో కొంతమంది తమ భార్యలను కోల్పోయారు, నేను వారితో తప్పని సరిగా ఉండాలి".

## 1880వ సం॥లో పయనీరింగ్ పరిచర్య

జేమ్స్ చాల్మర్స్ తన యొక్క ముఖ్య స్థావరాన్ని పోర్ట్‌మోర్స్‌బి కి మార్చినప్పటికి అతను ఎక్కడ అయితే మిషనరీ పని చేసి సువార్తను ప్రకటించాడో అక్కడ స్థానిక బోధకులను నియమించాడు. 1880సం॥ జూన్‌లో ఆరువారాలపాటు న్యూ గినియాలోని మారుమూల ప్రాంతాలకు బయలుదేరాడు. ఈ యాత్రలో అతను మోరోకా, సోగేరి, ఫవారే ప్రాంతాల గుండా ఈ ప్రయాణాన్ని సాగించాడు. ఆ ప్రాంతాల గురించి తెలిసినవారు "మీకు పిచ్చి ఏమైనా పట్టిందా", అని హెచ్చరించారు. ఈ యాత్రలో ఒకసారి కొండమీద నుంచి పడిపోయారు, దేవుని కృపనుబట్టి ప్రాణాపాయం నుంచి తప్పించబడ్డారు. ఈ ప్రయాణంలో జేమ్స్ చాల్మర్స్ దాదాపు 500 మైళ్ళు న్యూ గినియా ప్రాంతములోని దట్టమైన ప్రదేశాలకు వెళ్ళాడు. సమారు 40,000 అడుగుల ఎత్తును ఎక్కాడు. కెవో అనే ప్రాంతంలో ఉన్న ముఖ్య నాయకుడు అతనిని ఎంతగానో సత్కరించి ప్రేమించాడు. 1880వ సం॥ లో ఒక చిన్న పడవలో ఇద్దరు స్థానిక క్రైస్తవులతో కలసి అనిమారుపు, మెగ్వలైరా అనే ప్రాంతాల గుండా ప్రయాణం చేస్తూ, అక్కడున్న ప్రజలు చాలా దయనీయమైన స్థితిలో ఉన్నట్లు గమనించాడు. కరువుతో పీడింపబడి, చిన్న పిల్లలు పాకలేకపోతున్నారు, పెద్దవారైతే అస్థిపంజరాల్లాగా, పనిచేయడానికి శక్తిలేని స్థితిలో ఉన్నారు. ఇది చాలదన్నట్లు వారికి అనూమా రూపీయులతో శత్రుత్వం ఉన్నది. వారు వీరిని చంపడానికి సిద్ధమవుతున్నారు. జేమ్స్ చాల్మర్స్ వీరికి వస్తువులను, సరుకులను ఇవ్వలేకపోయాడు గానీ అనూమా రూపీయులతో మాట్లాడి వారి యొక్క శతృత్వాన్ని రూపుమాపాడు. ఆ ప్రాంతాన్ని దర్శించిన కొంతకాలానికే అక్కడ పుష్కలమైన వర్షము పడి కరువు కూడా ఆగిపోయింది. దీనివల్ల వారు జేమ్స్ చాల్మర్స్‌ని ఎంతో అభిమానించి అతనితో స్నేహాన్ని ఏర్పరచుకొన్నారు. అక్కడ కూడా అనేకమంది యేసుక్రీస్తును నమ్ముకొన్నారు. అక్కడ ఒక సంఘము ఏర్పడింది. ఇతను చేసిన విస్తారమైన యాత్రల వల్ల అతని పేరు ఆ న్యూ గినియా మొత్తం మారుమోగింది. అతనిని చూడనివారికి కూడా జేమ్స్ చాల్మర్స్ గురించి తెలిసింది.

మిగిలినది వచ్చే సంచికలో....

- డా. నాసరయ్య, వైజాగ్



# 10 మిషనరీ సూత్రాలు

**(నెహెమ్యా గ్రంథంనుండి)**

మిషనరీలకు నెహెమ్యా గొప్ప మాదిరి. అందులో అనుమానం లేదు. ఆయన దర్శనం కలిగిన గొప్ప నాయకుడు. తనకున్న దర్శనాన్ని అద్భుతంగా కార్యరూపంలోకి మార్చాడు. తన మిషన్‌ను లోతైన ప్రార్థనలచేత తడిపాడు. సరైన సమయంలో సరైన పనిని చేపట్టాడు. యెరూషలేము పట్టణం చుట్టూ 52 రోజుల్లోనే గోడను నిర్మించాడు.

అతని విజయానికి రహస్యం ఏమిటి? మనం నేర్చుకోవాల్సిన పాఠాలు అందులో ఏమైనా ఉన్నాయా? ఆధునిక మిషన్స్‌కు ఆ పాఠాలను అన్వయించగలమా? ఈ వ్యాసంలోని మిగతా భాగంలో ఈ ప్రశ్నలన్నిటికీ సమాధానాలు ఉన్నాయి. అవన్నీ నెహెమ్యా గ్రంథంలోని మొదటి 6 అధ్యాయాల ఆధారంగా రాసినవే.

**1. మన చుట్టూ జరుగుతున్న సంఘటనలను ఆసక్తితో గమనించు (1:2)**

ఆసక్తి అద్భుతాలను సృష్టిస్తుంది. ఈ ప్రపంచంలో జరుగుచున్న సంఘటనల సమాచారాన్ని సేకరించాలి. తాజా వార్తలు తెలుసుకోవాలి. ఆధునిక పోకడలను తెలుసుకోవాలి. నీ హృదయాన్ని కదిలించి, నీలో తృష్ణను ప్రేరేపించే సమాచారాన్ని సేకరిస్తూ ఉండాలి. దేవుడు తన పనిని ఇప్పటికే ప్రారంభించాడన్న విషయాన్ని మరచిపోవద్దు. ఆయన కదలికలను గమనించి, ఆయనను వెంబడించాలి. దేవుని సేవను ప్రారంభించేముందు చేయవలసిన మొదటి సోపానం ఇదే.

**2. నీ భారాన్ని దేవునికి తెలియజేయి (1:4)**

ఏ పనైనా ప్రార్థనతో మొదలు పెట్టు. ఇతరులను కలిసే ముందు, దేవుని సన్నిధిలో వారి గురించి ప్రార్థించు. నీ విజయం నీ ప్రార్థనా గదిమీదనే ఆధారపడి ఉంది. స్పష్టతను, బలాన్ని, ప్రేరణని, ధైర్యమును నీవు పొందుకొనే ప్రదేశం ఇదే. పని ప్రారంభించేముందు మాత్రమే నెహెమ్యా ప్రార్థించలేదు. తను ప్రారంభించిన పని ముగిసేవరకు ప్రార్థిస్తూనే ఉన్నాడు. ప్రార్థించడం ఆయన మానలేదు. ప్రార్థన అనే ద్వారము గుండా నీ మిషన్‌ను తీసుకెళ్ళు. అప్పుడు నీవు తప్పుడు మార్గం వైపు ప్రయాణించవు.

**3. అవకాశాలను సద్వినియోగం చేసుకోవడానికి సిద్ధంగా ఉండు (2:3):**

అవకాశాల కోసం ఎదురుచూడు. అవి వచ్చినప్పుడు, పూర్తిగా వాటిని సద్వినియోగం చేసుకో. నీవు తగిన విధంగా సిద్ధపడినప్పుడే ఇది సాధ్యమౌతుంది. అవకాశం నీదగ్గరకు వచ్చినప్పుడు వెనుకంజ వేయకు, తటపటాయించకు. నీవు ఆశించిన ఫలితం

రావటానికి ఆ అవకాశాన్ని నీవు బాగా ఉపయోగించుకోవడానికి జాగ్రత్తపడు. కొన్నిసార్లు మనకు ఆటంకంగా కనిపించేదే అద్భుత అవకాశంగా మారవచ్చేమో. ఏదీ గొప్ప సంభవం జరగాలని ఆశించకు. పనిని చిన్నగా ప్రారంభించు. నీ చేతిలోని పనికి నిన్ను నీవు సమర్పించుకో. చిన్నవాటిలో నమ్మకస్తుడవని నిరూపించుకో. గొప్ప గొప్ప కార్యాలను ముగించేది ఇలానే.

### 4. వనరులను సమకూర్చుకో (2:7)

అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకో. అది మానవ వనరులైనా, మరేవైనా. అదే భారము, మిషన్ కలిగిన వ్యక్తులను తెలుసుకో. ఎవరినీ, దేనినీ తక్కువ అంచనా వేయవద్దు. సరిగా సద్వినియోగం చేయగల జ్ఞానం నీకుంటే అందరూ లేదా అన్నీ ఉపయోగపడేవే. ఒక సరైన పనికి వనరుల కొదువ ఉండదు. దేవుడే నీ భాగస్వామి కాబట్టి నీకు వనరుల కొదువ ఉండదు. సమస్త వనరులతో నిండిన ఈ విశ్వం దేవునిది. దేవుడు పాల్గొనే పరిచర్యకు ఆ వనరులన్నీ అందుబాటులో ఉంటాయి.

### 5. లోతైన అవగాహన కలిగిఉండు (2:8)

ఎక్కువ వివరాలు తెలుసుకో, పరిస్థితిని ఎంత చక్కగా అవగాహన చేసుకొంటే అంత ప్రభావవంతమైన పరిష్కారాలను కనుగొంటావు. పుస్తకాలను చదువు. అవగాహన కోసం కొన్ని ప్రదేశాలను దర్శించు. నిపుణులతో మాట్లాడు. ప్రజలను, వారి భాష, వారి సంస్కృతి, వారి సమస్యలు, వారి అవసరాలు మొ॥ విషయాలను తెలుసుకో. సరైన నిర్ణయం తీసుకోవడానికి ఇది చాలా అవసరం. కార్యోన్ముఖమైన ప్రణాళికను సిద్ధపరచుకోవడానికి ఇది చాలా ఉపయోగపడుతుంది. సందర్భ వెలిగింపుతో లేఖనాలను పఠించు. అవసరమైతే శిక్షణ తీసుకో. ఇది నీకు నిర్దేశాన్ని ఇస్తుంది, నీ నైపుణ్యాలను సానబెడుతుంది. ఇది సమయాన్ని వృథా చేసినట్లు కాదు.

### 6. జట్టును తయారుచేసుకో (2:17)

నీ మిషన్‌ను నీవు ఒక్కడివే నెరవేర్చగలవని నీవెప్పుడు అనుకోకూడదు. ఒక మంచి



జట్టును తయారు చేసుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. యేసుక్రీస్తుకు కూడా ఒక మంచి జట్టు ఉంది. పనిని ప్రారంభించక ముందు ఆయన 12మందిని ఎన్నుకొన్నాడు. నీతో కలసి పనిచేసేవారిని గుర్తించు. నీ దర్శనాన్ని తృష్ణను వారితో పంచుకో. మంచి సంబంధాలను ఏర్పరచుకో. నీ జట్టును నమ్ము, వారి సామర్థ్యాలను గుర్తించు. పనిని ఇతరులకు పంచడం నేర్చుకో. వారిని మెచ్చుకోవాలి. అర్హులకు తగిన ప్రోత్సాహం ఇవ్వు. కలిసి పనిచేయడం నిజంగా ఎంతో పనిని నెరవేరుస్తుంది.

### 7. వ్యూహాన్ని రచించు (నెహెమ్యా 3)

వ్యూహంలేని పని లక్ష్యాన్ని నెరవేర్చదు. ఎంతో ప్రయాసపడతారు కానీ ఫలితం ఏమీ కనిపించదు. నీ మిషన్ నెరవేర్చే వ్యూహాలను నీవు రచించాలి. ఏమి చేయాలో ఏమి చేయకూడదో నీకు తెలిసి ఉండాలి. ప్రభావవంతమైన ఫలితాలను సాధించాలంటే అత్యుత్తమమైన వ్యూహం ఉండాలి. కీలకమైన పరిస్థితులను గుర్తించు. నీవు ఆశించిన ఫలితాలను తెచ్చే వాటిమీద నీ శక్తినంతా ఉపయోగించు. నీ దర్శనాన్ని పాడుచేసే వాటినన్నిటిని వదిలిపెట్టు. వాటికి 'నో' అని చెప్పడం నేర్చుకో. ప్రతి అడుగు వ్యూహాత్మకంగా వేయి.

### 8. వ్యతిరేకతను ఎదుర్కోవడానికి సిద్ధపడు (4:6)

విమర్శ, వ్యతిరేకతకు సిద్ధపడు. ఈ వ్యతిరేకత అంతర్గతంగా ఉంటుంది, బహిర్గతంగా ఉంటుంది. ఒక మంచి పని సహజంగానే పతనమైన ఈ లోకాన్ని రెచ్చగొడుతుంది. చెడు ఎప్పుడూ మంచికి వ్యతిరేకంగా పనిచేస్తూనే

ఉంటుంది. ప్రజలు నిన్ను భంగపరుస్తారు, నిరుత్సాహపరుస్తారు, భయపెడతారు, నిన్ను కిందకు లాగుతారు. అలాంటి సమయంలో నిరుత్సాహ పడవద్దు, వెనుతిరిగి చూడవద్దు. క్లిష్టమైన పరిస్థితులు ధృఢమైన వ్యక్తులను తయారుచేస్తుంది. పెద్దకార్యాలకు పెద్ద సమస్యలు వస్తాయి. వాటిని పరిష్కరించుకొంటూ వెళ్తే, నీవు కూడా పెద్దవానిగా ఎదుగుతావు.

### 9. ఆవదను తగ్గించే క్రమంలో తెలివిగా వ్యవహరించు (4:17)

సవాళ్ళను ఎదుర్కొనే సమయంలో దేవుని జ్ఞానాన్ని వెదకు. ఊహించని పరిణామాలు, అత్యవసర పరిస్థితులు ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండు. కొన్ని పనుల మీద మరికొంచెం శక్తిని వినియోగించాల్సి వస్తుంది. అవసరమైతే కొన్ని మార్పులు చేర్పులు చేయి. నిర్ణయాలు వెంటనే తీసుకో. ఒక ప్రణాళిక పనిచేయకపోతే మరొక ప్రణాళికను సిద్ధంగా ఉంచుకో. విలువలు దెబ్బతినకుండా జాగ్రత్తపడుతూనే, పద్ధతుల ను, ప్రణాళికలను మార్చుకొనే సరళత్వాన్ని కలిగి ఉండు. కొత్త ఒరవడితో సూక్ష్మబుద్ధితో సృజనాత్మకంగా వ్యవహరించు. ఆత్మపరిశీలన చేసుకొని తప్పులను సరిచేసుకో.





### 10. చక్కగా ముగించు (6:15)


నెహెమ్యా పనిని ప్రారంభించడమే కాదు, దాన్ని ముగించాడు కూడా. ప్రారంభించడం కంటే ముగించడం గొప్పది. చివరి వరకు పోరాడు. వెనుదిరిగి చూడకు. మధ్యలోనే విడిచిపెట్టవద్దు. విడిచిపెట్టేవాళ్ళు ఎప్పుడూ గెలవరు. గెలిచేవారు ఎప్పుడూ మధ్యలో విడిచిపెట్టరు. ఇప్పటికే ఆపేసి ఉంటే, మరలా ప్రారంభించు. నీవు వెనుకబడినప్పటికీ నీవు అందుకొంటావు. ఇది చిత్రకళలాంటిది. ప్రారంభం ఎవరైనా చేస్తారు. కాని నైపుణ్యం గలవారే చక్కగా ముగిస్తారు. చక్కగా ముగించిన వారికోసం కిరీటం సిద్ధంగా ఉన్నది. ముగింపులో దేవుడు నీకు బహుమానాన్ని ఇస్తారు.

(2012 జనవరి సంచిక నుంచి)

**– డా॥ తాళ్ళూరి ప్రసాద్**



# కోత విస్తారమే...



ఆయన సమూహములను చూచి, వారు కాపరిలేని గొఱ్ఱెల వలె విసికి చెదరి యున్నందున వారిమీద కనికరపడి కోత విస్తారమే గానీ పనివారు కొద్దిగా ఉన్నారు గనుక తన కోతకు పనివారిని పంపుమని కోత యజమానుని వేడుకొనుడని తన శిష్యులతో చెప్పెను (మత్తయి 9:36-38).

యుఐయస్ఐ నేషనల్ మిషన్స్ డిపార్ట్మెంట్ వారు నార్త్ ఇండియాలోని ఈ క్రింది రాష్ట్రాలను, వాటిలోని ప్రాముఖ్యమైన కొన్ని పట్టణాల గురించి ప్రార్థన చేయాలని ఎంపిక చేశారు.

**నార్త్‌వెస్ట్ జోన్**

జమ్మూ & కాశ్మీర్ : ఉదంపూర్, సాంబా, కత్‌వ, రాజోరి, అవంతిపుర

హిమాచల్ ప్రదేశ్: సోలన్, చాంబా, మండి, బిలాస్‌పూర్, ఉన

పంజాబ్ : అమృత్‌సర్, రూప్‌నగర్, పాటియాలా, సంగ్రుర్, బతిండా, పెరోజ్‌పూర్

హర్యానా : హిసార్, కురుక్షేత్ర, సిర్‌సా, కర్నల్, భివాని, రోతక్

**నార్త్‌జోన్:**

ఉత్తరఖాండ్ : హరిద్వార్, శ్రీనగర్, కోడ్వార్, పాట్నగర్, కషిపూర్

రాజస్తాన్ : భరత్‌పూర్, బికనీర్, అజ్మీర్, జోధ్‌పూర్, ఉదయ్‌పూర్

ఉత్తర్‌ప్రదేశ్ : మెరాదాబాద్, ఫైజాబాద్, బల్లియా, బండా

**నార్త్ సెంట్రల్ జోన్**

ఛత్తీస్‌ఘర్ : రైగ్రాహ్, కోర్‌బా, దంతారి, బాతపుర, జగదల్‌పూర్

మధ్యప్రదేశ్ : సాగర్, రేవ, ఉజ్జయిని, విదిష, శివ్‌పురి

**ఈస్ట్‌జోన్**

బీహార్ : గయ, మోతిహరి, ముజ్‌ఫర్‌పూర్, దార్‌బంగా, బగల్‌పూర్, బెగుసరై

జార్ఖండ్ : పలము, చైల్‌బాస, గుమ్‌లా, హజారిబాగ్

వెస్ట్‌బెంగాల్ : దుర్గాపూర్, ముషిదరబాద్, కళ్యాణి, జల్‌పైగురి, ఖరగ్‌పూర్,

సిక్కిం : గ్యాంగ్‌టక్, మజితార్, రవంన్‌గల

**ఈ రాష్ట్రాలను, వాటిలో పట్టణాలను ఎందుకు ఎంపిక చేశారు? వీటి ప్రాధాన్యత ఏంటి?**

- అత్యధిక జనాభా, అతి తక్కువ సౌవార్తీకరణ జరిగిన ప్రాంతాలు.
- రాజధాని పట్టణాలు, పలు రంగాలలో రాణిస్తున్న పట్టణాలు.
- ప్రీమియర్ ఇన్‌స్టిట్యూట్స్ (యన్ఐటి, ఐఐటి, ఐయస్‌టియస్, ఎయిమ్స్..) గల అత్యధిక విద్యాసంస్థలు ఇంటలెక్చువల్ విద్యార్థులు ఉండే స్థలాలు.
- దేశ నాయకులను, అధికారులను, ప్రపంచంలోని ఆయా దిగ్గజ కంపెనీలలోని సీఈవో, డైరెక్టర్స్‌ను, కుబేరులను ఈ రాష్ట్రాల నుంచి ఎక్కువగా చూడొచ్చు (గత పది సంవత్సరాల నుంచి).
- వేరు వేరు రాష్ట్రాల నుంచి వలస ప్రజలు, చదువుల నిమిత్తం విద్యార్థులు, ఉద్యోగాల నిమిత్తం ఎంతో మంది గ్రాడ్యుయేట్స్ ఉండే ప్రాంతాలు.
- ప్రపంచ పటంలో టాప్ టెన్‌లో ఆయా రంగాలలో ముందు ఉన్న ప్రాంతాలు.
- హైలీ టెక్నాలజీ ఇండస్ట్రియల్ సంప్రదాయ సాంస్కృతిక విధానాలలో మెరుగైన స్థానం ఉన్నప్పటికీ సాంఘికంగా, మౌళికంగా, ఆధ్యాత్మికంగా విలువలు లేని ప్రజలు గల ప్రాంతాలు. పేదరికం, కుల, మత విభేదాలు, వివిధ మాఫియా గుంపులు, క్రైమ్ రేట్ ఎక్కువగా గల ప్రాంతాలు.
- ఈ ప్రాంతాలకు దేవుని గూర్చిన సత్యాన్ని పరిచయం చేస్తే మన దేశాన్ని 60% సౌవార్తీకరించినట్లే.

**ఈ రాష్ట్రాల కోసం ప్రతి విద్యార్థి, గ్రాడ్యుయేట్ ఏమి చేయాలి?**

- అవగాహన కలిగి ఉండాలి. ఆయా స్థలాల సమాచారాన్ని తెలుసుకొని (నేషనల్ న్యూస్ ఛానల్స్ పేపర్స్ ద్వారా) వాటిని పంచుకోవడం చేయాలి.
- వాటిని పొందుపరిచి లేదా సమీకరించి ప్రార్థన చేయాలి (వ్యక్తిగతంగా, సామూహికంగా, ఉపవాస ప్రార్థనలలో).
- మిత్రులకు తెలియజేస్తూ ప్రార్థన చేయాలి లేక ప్రోత్సహించాలి. ఆసక్తి ఉంటే మిషన్ ప్రేయర్ గుంపుని కలిగి ఉండొచ్చు.



- విద్యార్థులు పై చదువులు నిమిత్తం ఈ పట్టణాల్లోని విద్యాసంస్థలకు వెళ్ళి పరిచర్య చేయవచ్చు (సియుసెట్ ద్వారా).
- గ్రాడ్యుయేషన్ పూర్తైన వారు జాబ్స్ నిమిత్తం టెంట్ మేకర్స్‌గా వెళ్ళి కొంతకాలం పనిచేయవచ్చు.
- గ్రాడ్యుయేట్స్ అయితే విద్యార్థులలో ఈ పట్టణాల నిమిత్తం అవగాహన తీసుకొస్తూ దేవుని చిత్తాన్ని కనుగొన్న వారిని ప్రార్థించి పంపించవచ్చు లేదా వెళ్లిన వారికి అన్ని విధాలుగా సహకరించవచ్చు.
- స్టాఫ్ అయితే ప్రతి ఇయు, ఇజియఫ్‌లలో సిటీస్ నిమిత్తం సంవత్సరంలో మూడు సార్లు అయినా ప్రార్థించేలా, ఆ ప్రాంతాలకు విద్యార్థులు వెళ్ళేలా ప్రోత్స హించవచ్చు.
- ఆసక్తి కలిగిన వారు మిషన్ డిపార్ట్మెంట్ ప్రోత్సాహంతో మిషన్స్ ఎక్స్పోజర్ ట్రిప్స్‌కి (యంఇటి), యస్‌విపి/జివిపి ప్రోగ్రామ్స్‌కి వెళ్ళి రావచ్చు.

ఆయనను బట్టి మనకు కలిగిన ధైర్యమేదనగా, ఆయన చిత్తానుసారముగా మనమేది అడిగినను ఆయన మన మనవి ఆలకించుననునదియే. మనమేమి అడిగినను ఆయన మన మనవి ఆలంకించునని మనమెరిగినయెడల మనమాయనను వేడుకొనినవి మనకు కలిగినవని యెరుగుదుము (1 యోహాను 5:13,14).

**– జె. పాల్ దేవకుమార్,** నంద్యాల
యుఇయస్ఐ–ఏపి మిషన్స్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ

సాక్ష్యం

# టర్నింగ్ పాయింట్



నా పేరు జె. నమ్రత మార్గరేట్. మా స్వగ్రామం కడప జిల్లా, రాయచోటి దగ్గర టి.సుండుపల్లి. నా విద్యాభ్యాసం కడప, నంద్యాల్లో జరిగింది. నేను 10వ తరగతి చదువుతున్నప్పుడు నంద్యాల్లో గుడ్‌షెప్పర్డ్ స్కూల్‌లో జరిగిన డిటి క్యాంప్‌కు వెళ్ళి 15 అక్టోబర్ 2013న యేసు ప్రభువుని నా సొంత రక్షకునిగా అంగీకరించాను. తర్వాత క్రమంగా జరిగిన బైబిల్ స్టడీస్, యంపిసిల ద్వారా నేను దేవునిలో బలపడ్డాను. నేను 2020లో శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ తిరుపతిలో ఇంజనీరింగ్ పూర్తి చేశాను. తిరుపతి ఇయు విద్యార్థిగా ఉన్నప్పుడు కమిటీలో ఔట్రీచ్ సెక్రటరీగా ఉండడానికి దేవుడు అవకాశమిచ్చాడు.

2018లో యస్‌యంటిసి, యన్‌యంటిసి-19కి హాజరయ్యాను. వీటికి హాజరవ్వడం వల్ల మిషన్స్ గూర్చిన అవగాహన పెరిగి, అవసరత అర్థమయింది. ఆ క్యాంప్స్ నా జీవితంలో ఒక టర్నింగ్ పాయింట్ అని చెప్పవచ్చు. ఎందుకంటే ఇండియా సర్వే ద్వారా ఉత్తర భారతంలోని వాస్తవ పరిస్థితుల్ని అర్థం చేసుకోవడానికి సహాయపడినది. ఈ క్యాంప్స్‌లో దేవుడు నాకు నేర్పిన విషయాలు, మిషనరీ త్యాగపూరిత జీవితాలు, నాకు ఎంతో స్ఫూర్తినిచ్చాయి. క్యాంప్స్ నుంచి తిరిగి వెళ్ళేటప్పుడు నా జీవితంపట్ల దేవుని పిలుపేంటో స్పష్టంగా అర్థంకాకపోయినా 'దేవా నీకోసం జీవిస్తాను, ఏమి చేయమంటే అది చేస్తాను, ఎక్కడికి వెళ్ళమంటే అక్కడికి వెళ్తాను' అనే ఒక మంచి నిర్ణయంతో తిరిగివచ్చాను.

తిరిగివచ్చాక ప్రతిరోజు భారతదేశంలోని రాష్ట్రాల గూర్చిన సమాచారం సేకరించి ప్రార్థన చేయడం ఆరంభించాను. ఇంజనీరింగ్ పూర్తయిన తర్వాత ఏం చేయాలని ప్రార్థిస్తూ ఉన్నప్పుడు నా మెంటర్ ద్వారా క్రిష్టియన్ ప్రొఫెషనల్ ఫోరమ్ వారు నిర్వహించే 'రైజ్ మూమెంట్' గురించి తెలిసి దానికి అప్లై చేసినప్పుడు వారి ద్వారా ఉత్తర ప్రదేశ్‌లోని సోన్‌బధ్ర జిల్లాలో రాబర్ట్స్‌గంజ్‌లోని మిషన్ ఫీల్డ్‌లో టెంట్‌మేకర్‌గా పనిచేయటానికి దేవుడు అవకాశం ఇచ్చాడు. ఈ విషయంలో ఆయన చిత్తాన్ని చాలా స్పష్టంగా కీర్తనలు 84 నుండి నా మౌన ధ్యాన సమయం ద్వారా తెలుసుకొన్నాను. దేవుని వాక్యంతో పాటు "బోర్డన్ ఆఫ్ యోల్" మిషనరీ జీవిత చరిత్ర నన్ను టెంట్‌మేకర్‌గా వెళ్ళేందుకు సవాలు చేసింది.

ఉత్తర ప్రదేశ్‌కి టెంట్‌మేకర్‌గా వెళ్ళడానికి మా తల్లిదండ్రులు ప్రారంభంలో ఒప్పుకోలేదు. దేవుడే తర్వాత వారిని ఒప్పించి, సమస్తమైన పరిస్థితుల ను అనుకూలపరిచాడు. మా తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. దాదాపు 4 నెలల తర్వాత ఆయన సమయంలో నన్ను నార్త్ ఇండియాకి నడిపించాడు. అక్కడికి వెళ్ళిన తర్వాత ముఖ్యంగా ప్రారంభ దినాల్లో భాషా సమస్యలు, ఆహారపు అలవాట్లు, ఒంటరితనం, ఆరోగ్య సమస్యలు, సాంస్కృతిక సమస్యలను ప్రధానంగా ఎదుర్కొన్నాను. కొన్ని సార్లు అక్కడ సరైన ఫెలోషిప్ లేక నా ఆత్మీయ జీవితం డ్రైగా ఉండేది. ఇక్కడికి

రావడం దేవుని చిత్తమేనా? నా నిర్ణయం సరైనదేనా అనే సందేహాలు వచ్చేవి. పని ఒత్తిడి, ఆరోగ్యం సరిగా లేనప్పుడు చాలా నిరుత్సాహం వచ్చేది. అయితే, ఈ సమస్యలన్నిటిని అధిగమించడానికి వ్యక్తిగత బైబిలు అధ్యయనం నాకు సహాయం చేసింది. “కొండలతట్టు నా కన్ను లెత్తుచున్నాను నాకు సహాయము ఎక్కడ నుండి వచ్చును? యెహోవా వలననే నాకు సహాయము కలుగును ఆయన భూమ్యాకాశములను సృజించినవాడు. ఆయన నీ పాదము తొట్రిల్లనియ్యడు నిన్ను కాపాడువాడు కునుకడు. ఇశ్రాయేలును కాపాడువాడు కునుకడు నిద్రపోడు”.(కీర్తనలు 121) అనే ఈ కీర్తన ద్వారా దేవుడు వాగ్దానం చేసి ఎల్లప్పుడు నాకు తోడుగా ఉంటూ అన్ని విషయాల్లో నన్ను నడిపిస్తున్నాడు. దేవునికే మహిమ కలుగునుగాక.

ప్రస్తుతం ఉత్తరప్రదేశ్, వారణాసి సమీపంలోని సోనెబద్రా జిల్లాలో ఐఇయం స్కూల్లో, సైన్స్ ఫ్యాకల్టీగా గత 8 నెలలుగా టీనేజ్ విద్యార్థుల మధ్య పనిచేస్తున్నాను. వారణాసి ఇజియఫ్ ఫెలోషిప్‌లో భాగం అయ్యే అవకాశం దేవుడు నాకు ఇచ్చాడు.

ఈ ప్రయాణంలో నా కొరకు ప్రార్థించిన నా ఆత్మీయులు, మరి ముఖ్యంగా నన్ను ఎల్లప్పుడూ ప్రోత్సహించి, నా కోసం భారంతో ప్రార్థన చేసి, నాకు దైవికమైన సలహాలను ఇచ్చిన యన్‌యంటిసి డివోషనల్ స్పీకర్ బిల్లీ గారు (నేను ఆయన్ను ‘గ్రాండ్ పా’ అని పిలుస్తాను), నా మెంటర్ సుమ శ్రీనివాస్ అక్క పాత్ర మరువలేనిది. కాలేజ్ రోజుల్లో ఉన్నప్పుడు నా ఆత్మీయ ఎదుగుదలకు నంద్యాల, తిరుపతి ఇయులు ప్రముఖ పాత్రను వహించాయి.

దేవుని చిత్తానికి లోబడాలంటే ప్రతి అవసరం కొరకు దేవుని పైన ఆధారపడటం, జీవితంలో రిస్క్ తీసుకోవడం, సవాళ్లను స్వీకరించడం, కంఫర్ట్ జోన్ నుండి బయటకు రావడం చాలా ముఖ్యమనే విషయాలను దేవుడు నాకు నేర్పించాడు.

విద్యార్థులకు మంచిగా బోధించేటట్లు, వ్యక్తిగతంగా వారిని కౌన్సెలింగ్ చేసేటట్లు, వారి అభివృద్ధి కొరకు, పరిచర్య కొరకు, అలాగే నా ఆత్మీయ జీవితం కొరకు, చివరి వరకు ప్రభువు కోసం నమ్మకంగా జీవించేటట్లు, నా కుటుంబం కొరకు ప్రార్థించాలని కోరుతున్నాను.

– జె. నమ్రత మార్గరేట్, వారణాసి

**కవిత**



## ఓ మిషనరీ ...

నీవు మట్టిలో మాణిక్యానివే
ఎందుకంటే
మహోన్నతుని పిలుపునందుకొని
కాంతిలేని కటిక చీకటిలో
ప్రకాశించడానికి పంపబడిన వెలుగువి


నీవు మట్టిలో నీటి బొట్టువే
ఎందుకంటే
బీడుభూమిల్ని దున్ని
పాడుబడిన జీవితాల్ని
వాక్యమనే నీటితో సాగుచేస్తున్నావు

నీవు వెలుగుతున్న కొవ్వొత్తివే
ఎందుకంటే
చీకటి జీవితాల్ని వెలిగించడానికి
అంధకారంలో అహర్నిశలు శ్రమిస్తూ
అరిగిపోతూ కరిగిపోతూ కాలిపోతున్నావు

నీవు మట్టిలో పడ్డ రక్తపు బొట్టువే
ఎందుకంటే
సత్యంకోసం సువార్తకోసం
క్రూరులు కర్కశంగా హింసించినా
యేసయ్యవలె రక్తం చిందించడానికి సిద్ధపడ్డావు

నీవు నశిస్తున్న లోకంలో నిలువెత్తు సాక్ష్యానివే
ఎందుకంటే
ప్రేషితసేవను యూట్యూబ్‌లకి పరిమితం చేసి
లైక్‌లు, షేర్‌లు, సబ్‌స్క్రైబ్‌ల పోటీతత్వం నుంచి
గుర్తింపులేని వానివలె గురి యొద్దకే
పరుగెడుతున్నావు

– డా. యం. సాల్మన్‌రాజు, వైజాగ్



కథానిక

# అప్పగించబడిన పని

"ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున అవి మంచివైనను సరే, చెడ్డవైనను సరే, దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మనమందరమును క్రీస్తు న్యాయపీఠము ఎదుట లెక్క అప్పచెప్పాల్సిందే!" చెవి దగ్గర నుంచొని ఎవరో పదేపదే చెప్పినట్లు అనిపిస్తుంటే తుళ్ళిపడి లేచి చుట్టూ చూశాడు విల్సన్. దరిదాపుల్లో ఎవరూ కనిపించలేదు. ఏసీలో నుంచి గాలి చల్లగా వస్తోంది. మిణుకు మిణుకుమంటున్న బెడ్ లైట్ కాంతిలో గదంతా మసక మసగ్గా కనిపిస్తోంది. పైకి లేచి టేబుల్ మీదున్న బాటిల్లోని నీళ్ళు తాగి కుర్చీలో కూర్చున్నాడు. తలుపు గడియ తీసుకొని హాల్లోకి వచ్చి సోఫాలో జారగిలబడ్డాడు. పైకి చూస్తుంటే ముచ్చటపడి కొత్త ఇంటికి చేయించుకున్న సీలింగ్ కొత్తగా కనిపిస్తోంది. ఎక్కడా రాజీ పడకుండా, ఖర్చుకు వెనకాడకుండా మూడు బెడ్రూమ్‌లతో దగ్గరుండి కట్టించుకున్న ఇల్లది. గేటులో నుంచి లోపలికి వస్తుంటే అటూ ఇటూ పల కరించే పూలచెట్లు, కారు పెట్టుకోవడానికి వీలుగా ఒక పక్కగా కట్టించిన కారుషెడ్డు, ఎడమవైపు నుంచి మేడపైకి వెళ్ళడానికి వీలుగా కట్టించిన మెట్లు ఇంటికి మరింత అందాన్ని చేకూర్చాయి.

ఇంటిని గుర్తుచేసుకొంటున్న కొద్దీ విల్సన్‌ని ఏదో తెలియని ఆనందం ఉక్కిరిబిక్కిరి చేసింది. అద్దె ఇంట్లో పడిన ఇబ్బందులు గుర్తొచ్చాయి. కరెంటు దగ్గర, నీళ్ళ దగ్గర, గోడలకు మేకులు కొట్టినప్పుడు ఇంటివాళ్ళతో పడిన మాటల వల్ల బాధపడిన సందర్భాలు మదిలో మెదిలాయి. ఇప్పుడు తనిష్టం! ఏ చిన్న పనినైనా హాయిగా చేసుకోవచ్చు. సొంతిల్లు గనుక ఎవరి అనుమతీ అక్కర్లేదు!

కుర్చీలో వెనక్కి జారబడి కళ్ళు మూసుకొన్నాడు విల్సన్. గడిచిన రోజులన్నీ కళ్ళముందు నిలిచాయి. చదువుకొనే రోజుల్లో తనకోసం రోజూ వచ్చే జయన్న గుర్తొచ్చాడు. పక్కన కూర్చొని దేవుని గురించి చెప్తుండేవాడు. 'యవ్వనంలోనే దేవుణ్ణి వెదకాలని' చెప్పేవాడు. తప్పించుకొని తిరిగిన కొద్దీ వెంబడించి మరీ సువార్త చెప్పేవాడు. ఏ మాత్రం సంబంధం లేని తన పట్ల అన్న చూపిస్తున్న ప్రేమకు ఆశ్చర్యపడేవాడు. ఒకరోజు దేవుని వాక్యం ద్వారా హెచ్చరించబడి రక్షణ పొందాడు. ఆనాటి నుంచి జయన్న అంటే విల్సన్‌కి ప్రత్యేకమైన అభిమానం ఉండేది. అన్నతో కలిసి బైబిల్ స్టడీస్‌కి, క్యాంప్‌లకు వెళ్ళి దేవునిలో బాగా బలపడ్డాడు. అన్న లేనప్పుడో, అవకాశం వచ్చినప్పుడో బైబిల్ స్టడీస్ తీసుకోవడం అలవాటు చేసుకొన్నాడు. క్రమంగా పరిచర్య పట్ల అవగాహన, చేస్తున్న పనిపట్ల అంకితభావం అలవాటయ్యాయి.

ఇప్పుడు ఆ రోజులన్నీ జ్ఞాపకాల్లో కదలాడే గతంలా మిగిలిపోయింది. తప్పించుకోలేని పనులతో జీవితం ఖాళీ లేకుండా అయిపోయింది. ఏవి పనికొచ్చేవో, ఏవి పనికిరానివో కూడా అర్థం చేసుకోలేని స్థితికి వెళ్లిపోయాడు.

ఇక ఇప్పుడు విద్యార్థుల్ని వెతకడమంటే ఏదో తెలియని నిర్లక్ష్యం. చెయ్యాలి కాబట్టి చేసే మొక్కుబడి తంతు! ఎవరో ఒకరి మీద భారం వేసి ఏమీ పట్టనట్లు కూర్చొనే నులివెచ్చటి స్థితి!

❋❋❋

ఒక ఇంటిని కొనడానికి, వంద ఇళ్ళకు తిరిగి వెయ్యి ఇళ్ళ నమూనాలు చూశాను. ఒక కారు కొనాలన్న ఆలోచన కలిగినప్పుడు తెలిసిన వాళ్ళందర్నీ వాకబు చేశాను. తెలిసిన షోరూమ్‌లన్నీ తిరిగాను. అంతెందుకు ఇంట్లోకి టీవీ, ఫ్రిజ్, ఏసీ కొనాలన్నా షాప్స్‌లో తిరిగి అమ్మేవాళ్ళను నా ప్రశ్నలతో విసిగించేశాను. ఇప్పుడేంటి ప్రభువా.. నీ వాక్యం చెప్పడానికి కిలోమీటర్ ప్రయాణం చేయలేకపోతున్నాను? గుమ్మం దాటి ఒక్క హాస్టల్‌కి వెళ్ళలేకపోతున్నాను?యంపిసి లేదు, ఔట్రీచ్ లేదు, అసలు పరిచర్యే లేదు! వంకల మీద వంకలు చెప్పి తప్పించుకుంటున్నాను? అయినా నీ పరిచర్య చేయడానికి నాకు నిజంగానే టైమ్ లేదా? లేక నీవిచ్చిన, నీకు లెక్కచెప్పాల్సిన సమయాన్ని లోకానికిచ్చేశానా?

"నీకప్పగించబడిన పనేంటి?ఆ పని చేయడానికి దేవుడు నిన్నే ఎందుకు ఎన్నుకొన్నాడు. నీ దగ్గర డబ్బుందని, నీ మెదడు నిండా తెలివితేటలున్నాయని, మంచి ఉద్యోగంలో ఉన్నావని నిన్ను కోరుకొన్నాడా? అధికుల్ని సిగ్గుపర్చడానికి అల్పుల్ని వాడుకొనే దేవుడు మన దేవుడు! అలాంటి దేవుణ్ణి కలిగిన మనమంతా మన పనిలో ఎంత నమ్మకంగా ఉంటున్నామో ఆలోచించుకోవాలి! నీకప్పగించిన పనిని నీ శక్తివంచన లేకుండా పూర్తిచేసి దేవుడికి లెక్క అప్పజెప్పాలి" పాస్టర్ గారు చెప్తున్న వాక్యాన్ని వింటూ కుర్చీలో అసహనంగా కదిలాడు విల్సన్.

వాక్యమెందుకో కళ్ళు, చెవుల్ని దాటి హృదయంలోకి వెళ్ళలేకపోతోంది. యాంత్రిక జీవనంలో బండరాయిలా మారిన గుండె గోడల్ని వాక్యం తడిమి చాలా రోజులయింది. వాక్యం అద్దం లాంటిదని, రెండంచుల వాడిగల ఖడ్గం లాంటిదని ఎన్నో ఏళ్ల నుంచి వింటూనే ఉన్నాడు. అయినా ఎందుకో ఈ మధ్య బద్దలైన అద్దంలోనే మొహం చూసుకుంటున్నాడు. ఖడ్గం మీదే నడుస్తూ ముందుకు సాగుతున్నాడు. అయినా పాదాలకు గాయం కావట్లేదు. రక్తం కారట్లేదు. చిత్రంగా విల్సన్ దేహంలో రక్తం లేదు, కళ్ళల్లో కన్నీళ్ళూ లేవు!

'ఇంతకీ దేవుడు నాకప్పగించిన పనేంటి?నేను దేవుడికి అప్పజెప్పాల్సిన లెక్కేమిటి?' ఆలోచనలో పడ్డాడు విల్సన్. ఏమో! పొద్దున్నే లేచి వాకిట్లో మొక్కలకు నీళ్ళు పోయాలి. ఇంటి వెనుక కట్టేసిన కుక్కల్ని బయటికి తీసుకెళ్ళాలి. అరుగుల మీద కూర్చుని కబుర్లు చెప్పాలి. అవసరమైన విషయాలన్నిటిలో తలదూర్చాలి. అడగకపోయినా సలహాలివ్వాలి. ఉద్యోగాన్ని దేవుడికంటే ఎక్కువగా, జీతాన్ని జీవితానికి మూల సాధనంగా మార్చుకోవాలి. కార్యక్రమాలు జరిగినప్పుడు నలుగురిలో కనబడే పనులు చేయాలి. 'చాలా యాక్టివ్' అని అందరిచేతా అనిపించుకోవాలి! ఇవేనా దేవుడు తనకప్పగించిన పనులు!

ఆలోచించేకొద్దీ విల్సన్ మనసు వేదనలో కూరుకుపోయింది. ఆస్తుల్నిచ్చి, హోదానిచ్చి, ఆరోగ్యాన్నిచ్చి, అన్నీ తానై ముందుండి నడిపించే దేవుణ్ణి కలిగివున్న తనెందుకో నీరసించిపోతున్నాడు? చల్లగానూ, వెచ్చగానూ లేకుండా నులివెచ్చగా మారిపోతున్నాడు? మహోన్నతుని చాటునుంచి తప్పించుకుని తిరుగుతున్నాడు? ప్రార్థన ముగిసింది. అందరితో పాటు ఆమేన్ అని చెప్పి ఆవలిస్తూ కుర్చీలోనుంచి పైకి లేచాడు.

"అన్నా... బాగున్నావా" అంటూ షేక్ హ్యాండిస్తూ పలకరించాడు రవి. "హా.. తమ్ముడూ.. బాగున్నాను?"రవి వంక చూడకుండానే పలకరించాడు.

రవి కళ్ళల్లోకి చూడాలంటే ఏదో ఇబ్బందిగా అనిపించింది. 'గ్రాడ్యుయేట్' అనే పేరు పెట్టుకొన్నా తన పూర్తి సమయమంతా 'సొంత పనుల్లోనే' గడిచిపోతోంది. ఇన్నేళ్ళనుంచి లోకంలో ఎక్కడ వెనకపడతానోనని పరిగెడుతూనే ఉన్నాడు. ఇక పరిచర్య చేసేదెప్పుడు? ప్రభురాజ్యం వెదికేదెప్పుడు?

"అన్నా... ఆరునెలల నుంచి మీరు రావట్లేదు. కొత్త తమ్ముళ్ళు కూడా మన ఇయుకి పరిచయం అయ్యారన్నా. ఒకసారి మీరొస్తే బాగుంటుంది..." అన్నాడు రవి.

రవి వంక చూశాడు. 'రమ్మనడం'లో అతనికి ఏ ఉద్దేశమూ లేదు. అయినా ఎదుటపడి అడగడం 'తప్పు చేసినవాణ్ణి నిలదీసి' అడిగినట్లుగా అనిపించింది ఒక్క క్షణం. వారంలో ఒక్క గంట యంపిసికి, మరో గంట బైబిల్ స్టడీకి కేటాయించలేనంత బిజీగా

అయిపోయాననే ఆలోచన విల్సన్‌ని కుదిపేసింది. అయినా దాన్ని లోలోపలే అణిచిపెట్టుకొన్నాడు.

"ఎక్కడ తమ్ముడూ... ఎప్పుడూ ఏదో ఒక పని ఉంటూనే ఉంది. ఒక్క చేతిమీద అన్ని పనులూ చేసుకోవడంలో కొన్ని మర్చిపోతున్నాను. నువ్వు ప్రతీవారం ఫోన్ చేసి గుర్తుచేస్తూనే ఉన్నావు. కానీ ఆ టైంలో నేనే ఏదో ఒక మీటింగ్‌లోనో, బజారులోనో ఉండడం వల్ల అటెండ్ కాలేకపోతున్నాను'' అన్నాడు.

"పర్లేదన్నా.. ఈ వారమైనా వీలు కుదిరితే హాస్టల్‌కి రండన్నా" అన్నాడు రవి. అతని భుజం మీద చేయివేసి అక్కడినుంచి కదిలాడు.

❋❋❋

ఇంటికి బయల్దేరిన విల్సన్ మనసంతా బాధతో నిండిపోయింది. ఒక విద్యార్థిని చేరదీసి సువార్త చెప్పలేనంత తలకు మించిన పనుల్లో తలమునకలై పోయాడు. దేవుని కొరకు నిలబడే మంచి శిష్యుడిగా తయారు చేయడంలో తను విఫలమై పోయాడు. పొరపాటున ఎప్పుడైనా కాళ్ళీడ్చుకుంటూ, పనులన్నీ మానుకొని హాస్టల్ని వెతుక్కుంటూ వెళ్తే ఒక్కడు కూడా దొరకడు. ఒకవేళ ఉన్నా.. గదిలో ఆ మూలో, ఈ మూలో సెల్ఫోన్స్‌లో మునిగితేలుతుంటారు. కనీసం 'అన్న వచ్చాడనే' స్పృహ ఉండదు. పలకరించే జ్ఞానం ఉండదు. చూసి ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోతారు. అలాంటి పరిస్థితుల్లో ఎవరికైనా ఎలా వెళ్ళాల నిపిస్తుంది? ఎందుకో ఒక్కసారిగా జయన్న గుర్తొచ్చాడు విల్సన్‌కి. 'అన్న కూడా తననిలాగే వదిలేస్తే ఏ స్థితిలో ఉండేవాడు? ఎన్నిసార్లు అన్నను లెక్కచేయకుండా నా కు పనుందని, చదువుకోవాలని, ఇప్పుడు కుదరదని చెప్పాను. కొన్నిసార్లు గౌరవం లేకుండా మాట్లాడినా అన్న చిరునవ్వుతో వెళ్ళేవాడు. నీ కోసం ప్రార్థిస్తు న్నాను తమ్ముడూ అని చెప్పేవాడు. ప్రేమతో పల కరించేవాడు. ఇవన్నీ తలచుకొంటుంటే విల్సన్‌కి తెలియకుండానే దు:ఖం వెల్లువలా పొంగింది.

❋❋❋

ఆ రాత్రి గదిలో ఒక్కడే బైబిల్ ముందు కూర్చున్నాడు విల్సన్. వాక్యమిప్పుడు తన నిజ స్వరూపాన్ని చూపించే అద్దంలా మారింది. రెండంచుల వాడియైన ఖడ్గమేదో గుండెను నిలువునా కోయసాగింది. కళ్ళు మూసుకున్నాడు.

"ప్రభూ! నీ రాజ్యాన్ని, నీతిని వెతకడం కంటే ముందే నా ఇంట్లోకి ఏవి అవసరమో తెలుసుకున్నాను. సర్వలోకానికి వెళ్ళి సువార్త ప్రకటించడం కంటే ముందే అన్ని ప్రాంతాలకూ తిరిగి నాక్కావాల్సిన వాటిని సమకూర్చుకొన్నాను. ఒక ఇంటిని కొనుగోలు చేయడానికి, వంద ఇళ్ళకు తిరిగాను. వెయ్యి ఇళ్ళ నమూనాలు చూశాను. ఒక కారు కొనాలన్న ఆలోచన కలిగినప్పుడు తెలిసిన వాళ్ళందర్నీ వాకబు చేశాను. తెలిసిన షోరూమ్‌లన్నీ తిరిగాను. ఏ కారు చక్రాలు బాగుంటాయో, ఏ మోడల్ స్టీరింగ్ అనుకూలంగా ఉంటుందో, మైలేజ్ ఏది ఎక్కువో, జీవితాంతం తిరిగినా ఇంజిన్ చెడకుండా ఏ కారు ఎక్కువకాలం నడుస్తుందో ఎంక్వైరీ చేశాను. అంతెందుకు ఇంట్లోకి టీవీ, ఫ్రిజ్, ఏసీలు కొనాలన్నా షాప్స్‌లో తిరిగి తిరిగి అమ్మేవాళ్ళను నా ప్రశ్నలతో విసిగించేశాను.

ఇప్పుడేంటి ప్రభువా.. నీ వాక్యం చెప్పడానికి కిలోమీటర్ ప్రయాణం చేయలేకపోతున్నాను? గుమ్మం దాటి ఒక్క హాస్టల్‌కి వెళ్లలేకపోతున్నాను? యంపిసి లేదు, బైట్రీచ్ లేదు, అసలు పరిచర్యే లేదు! వంకల మీద వంకలు చెప్పి తప్పించుకుంటున్నాను? అయినా నీ పరిచర్య చేయడానికి నాకు నిజంగానే టైమ్ లేదా? లేక నీవిచ్చిన, నీకు లెక్కచెప్పాల్సిన సమయాన్ని లోకానికిచ్చేశానా? ఏమోలే... నేనెన్ని చేసినా నువ్వు నన్ను జీవితాంతం క్షమిస్తూనే ఉంటావుగా! పైగా ఏ మీ లేని స్థితి నుంచి ఊహించలేని ఆశీర్వాదాలను నా పైన కుమ్మరించేశావు? ఆ ఉక్కిరిబిక్కిరిలోనే కాల మంతా గడిచిపోతుంటే నా పక్కనున్న హాస్టల్‌కెళ్ళి నలు గురు పిల్లల్ని వాక్యమనే పాలు తాగించాలనే ఆలోచన నాకెలా కలుగుతుంది ప్రభూ!

'ఈ సంవత్సరం అయినా ఫలిస్తానని' ఆశపడి నన్నింకా సజీవుడిగా ఉంచావు. ఆరోగ్యంతో తిరిగేలా చేస్తున్నావు. కోపంతో నువ్వు కన్నెర్ర చేస్తే నా పరి స్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవడానికే భయంగా ఉంది. ప్రభువా.. నన్ను సరిచేయి. లోకాశలతో పెనవేసుకుపోయిన నా మనసును విడిపించు. నా శక్తుల మీద, యుక్తుల మీదా కాదు.. నీ మీద ఆధారపడడం నేర్పించు. గాలి లేకుండా ఎలా బతకలేమో అలా నీతో సహవాసం లేకుండా, నీ పరిచర్య లేకుండా బతకలేని స్థితికి నన్ను నడిపించు" అని పశ్చాత్తాపంతో ప్రార్థించి పైకి లేచాడు విల్సన్.

**– డా. జడా సుబ్బారావు,** నూజివీడు

## కోశాధికారి లేఖ

# ధనం ఇవ్వడంలో దేవుని ఉద్దేశాలు

క్రీస్తునందు ప్రియమైన యుఇయస్ఐ-ఏపిలోని కోశాధికారులందరికి, సభ్యులకు
మన ప్రభువును రక్షకుడునైన యేసు క్రీస్తు నామములో శుభాకాంక్షలు.

మనుష్యులకు ధనాన్ని ఇవ్వడంలో దేవునికి నాలుగు ఉద్దేశాలు ఉంటాయని సెల్విన్ హ్యూగ్స్ అంటాడు.

1. మన ప్రాథమిక అవసరాలు తీర్చుకోవడానికి
2. ప్రేమపూర్వకమైన ఆయన నడిపింపును స్థిరపరచుకోవడానికి
3. మనలో దాతృత్వ లక్షణాలను పెంపొందించడానికి
4. ఆయన దైవశక్తిని బయలుపరచడానికి

మన కనీస అవసరాలు (ఆహారం, వస్త్రాలు, ఆశ్రయం) తీర్చుకోవడానికి డబ్బు అవసరం. మన కనీస అవసరాల గురించి కొండమీద ప్రసంగంలో యేసుక్రీస్తు ప్రస్తావించాడు.

మొదట ఆయన రాజ్యాన్ని, నీతిని వెదికితే అవన్నీ మనకు లభిస్తాయని చెప్పాడు. అంతేకాదు ప్రభువు, తన శిష్యులకు నేర్పించిన ప్రార్థనలో కూడా మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము అనే వాక్యాన్ని జోడించాడు. అంటే మన కనీస అవసరాల కోసం కూడా ఆయనమీద ఆధారపడాలనేది దేవుని ఉద్దేశం. కాబట్టి ఆయన మనకిచ్చిన డబ్బును మన ప్రాథమిక అవసరాలు తీర్చుకోవడానికి ఉపయోగించాలి.

రెండవదిగా ఆయనిచ్చే నడిపింపును స్థిరపరచుకోవడం కోసం డబ్బు ఉపయోగపడుతుంది. మనం చేయాలనుకున్న పనికి అవసరమైన డబ్బును సమకూర్చడం ద్వారా ఇది నా చిత్తం, నీవు ముందుకు వెళ్ళవచ్చు అని దేవుడు మనల్ని ప్రోత్సాహపరుస్తాడు. కొన్నిసార్లు అవసరమైన డబ్బు సమకూరక పోవడం ద్వారా, చేయాలనుకొన్న పని ఆయన చిత్తం కాదని గ్రహించవచ్చు.

మూడవదిగా దాతృత్వ లక్షణాన్ని పెంపొందించడం. దేవుడు మనకిచ్చిన ధనంలో కొంత భాగం ఆయన రాజ్య విస్తరణకు ఉపయోగించడం, మరికొంత భాగాన్ని అవసరంలో ఉన్న విశ్వాసులతో పంచుకోవడం అనేది ఆయన మన నుంచి కోరుకొంటున్నాడు. దేవుని ముఖ్య లక్షణాలలో ఒకటైన దాతృత్వ లక్షణం మనం సంతరించుకోవాలని దేవుడు కోరుకొంటున్నాడు.

నాల్గవదిగా, మనం అవసరంలో ఉండి ప్రార్థించినప్పుడు ఆశ్చర్యరీతిలో మనకు అవసరమైన డబ్బును ఇవ్వడం ద్వారా ఆయన శక్తిని కనుపరచడం మనలో చాలా మందికి అనుభవమే.

దేవుడు మనకిచ్చిన ధనాన్ని సరైన రీతిలో వినియోగించడానికి ఆయన జ్ఞానం అవసరం. ప్రార్థనాపూర్వకంగా మన డబ్బును సద్వినియోగపరుద్దాం. దేవుడు మనలను పురికొల్పిన కొలది ప్రార్థించి, పాల్గొందాం. ప్రభువును మహిమపరుద్దాం.

**స్తుతించండి**

1. మన స్టాఫ్‌కు 100% శాలరీ, అలవెన్స్‌లు ఇవ్వడానికి ప్రభువు చూపిన కృపను బట్టి

**ప్రార్థించండి**

1. యుఇయస్ఐ-ఏపి ఏసియం-2022 తర్వాత పెరిగిన 16.53% బడ్జెట్‌కు అనుగుణంగా ఇజియఫ్‌లు కాంట్రిబ్యూషన్స్ పెంచి పంపేటట్లు
2. స్టెరెట్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కోసం 8 లక్షలు, చాందపిళ్ళ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కొరకు 5 లక్షలు అవసరం
3. యుఇయస్ఐ నేషనల్ వేతన సవరణలకు అనుగుణంగా మన స్టాఫ్‌కు కూడా వేతనాలు పెంచడానికి ఏసియం 2022 నిర్ణయించింది. దీని అవసరత ప్రతి నెల రూ. 70,000/- పెరుగుతుంది.
4. స్టాఫ్‌కు ఐదు ల్యాప్‌టాప్‌లు సబ్సిడీలో ఇవ్వడానికి అవసరమైన 1,20,000/- కొరకు

ఇట్లు
క్రీస్తులో మీ సహోదరుడు
(signature)
**యస్.ఆర్.డి. కిషోర్ కుమార్**

**AP MONTHLY REQUIREMENT – Rs. 11,41,000/- (16.53% Hike W.R.T present income)**
**MONTHLY REQUIREMENT FOR UESI NATIONAL – Rs. 4,32,000/-**
**TOTAL - 15,73,000**


## MARCH - 2023

| Receipts | | Payments | |
|---|---|---|---|
| Opening Balance | 503.00 | Field Staff Salaries | 5,15,903.00 |
| General Fund | 18,73,362.00 | Field Staff HRA, CA, MA & TA | 3,10,004.00 |
| Staff Support | 65,000.00 | Office Staff Salaries | 1,64,061.00 |
| | | UESI | 6,05,000.00 |
| | | Rajasthan | 30,000.00 |
| | | Jammu & Kashmir | 15,000.00 |
| | | APEGF | 3,000.00 |
| | | Girls Depatment | 3,500.00 |
| | | To Gratuity | 50,000.00 |
| | | To SWF | 1,50,417.00 |
| | | Office Expenditure | 91,980.00 |
| **Total** | **19,38,865.00** | | **19,38,865.00** |

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No. : **GTR/59/2021-2023**

**Date of Printing: 25-04-2023**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508




# జార్జ్ వర్వర్

## (వెలుగును తీసుకెళ్ళు)

20వ శతాబ్దంలో దేవుడు ఏర్పాటు చేసుకొన్న గొప్ప దైవజనులలో జార్జ్ వర్వర్ ఒకరు. దేవుడు తనకు ఇచ్చిన భారంతో ప్రపంచాన్ని ప్రభావితం చేసిన ఒక గొప్ప సువార్తికుడు. 'ఆపరేషన్ మొబలైజేషన్' అనే సంస్థ ద్వారా క్రైస్తవ సాహిత్యాన్ని ప్రపంచ వ్యాప్తంగా అందించి, తానే స్వయంగా కొన్ని అద్భుతమైన పుస్తకాలు రచించి, క్రైస్తవ విశ్వాసుల హృదయాలను రగిలించి 'సాహిత్యం ఒక డైనమైట్' లాంటిదని చాటి చెప్పిన గొప్ప దార్శనికుడు. ప్రపంచంలోని ప్రతి మనిషి కనీసం ఒక్కసారైనా సువార్తను వినాలనే హృదయ భారంతో తన జీవితాన్ని వ్యయపరచుకొన్న గొప్ప సువార్తికుడు. ప్రేషిత సేవ ఉద్యమాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రోత్సహించిన గొప్ప మిషనరీ జార్జ్ వర్వర్.

న్యూజెర్సీలో వైకాఫ్ అనే ప్రాంతంలో 2 జులై 1938లో జార్జ్ వర్వర్ జన్మించాడు. వీరి పొరుగువారైన డోరతీ క్లాప్‌గారు జార్జ్ వర్వర్‌కు 14సం॥ల వయసు ఉన్నప్పుడు యోహాను సువార్తను ఇచ్చింది. ఆమె ఇంటి దగ్గరలోని జార్జ్ పాఠశాలలోని విద్యార్థులు యేసుప్రభువును అంగీకరించి, ఆయన సందేశాన్ని భూదిగంతాలవరకు తీసుకెళ్ళాలని 18సం॥ల నుంచి ప్రార్థిస్తున్నారు. ఆ 'పరిశుద్ధాత్మని హిట్ లిస్ట్‌లో' జార్జ్ పేరును కూడా రాసుకొని అతని రక్షణ కోసం ప్రార్థించారు. దేవుడు ఆమె ప్రార్థనకు జవాబు ఇచ్చాడు. తన 16సం॥ల వయస్సులో, న్యూయార్క్‌లోని మ్యాడిసన్ స్క్వేర్‌లో బిల్లీగ్రేహం నిర్వహించిన ఒక సౌవార్తిక సభలో జార్జ్‌వర్వర్ మారుమనసు పొందాడు. మారుమనసు పొందిన ఒక సంవత్సరం లోపు తన క్లాస్‌మేట్స్‌కు సువార్త చెప్పి, వారిలో 200 మందిని ప్రభువు వద్దకు నడిపించాడు. అలాగే, న్యూయార్క్ వీధుల్లో అనేకమందికి వేలకొలది సౌవార్తిక కరపత్రాలు పంచాడు. ఈ క్రమంలోనే సువార్తను ప్రకటించాలని, సౌవార్తిక సాహిత్యాన్ని పంచాలనే భారాన్ని, తలాంతును దేవుడు తనకు ఇచ్చాడని జార్జ్ గ్రహించాడు. 'ఆపరేషన్ మొబలైజేషన్'కు బీజాలు పడింది ఇక్కడే. 'సెండ్ ద లైట్' (వెలుగును తీసుకెళ్ళు) అనే పేరుతో క్రైస్తవ సాహిత్యాన్ని అనేక దేశాల్లో పంచిపెట్టాడు. తర్వాత డ్రెనాను వివాహం చేసుకొన్నారు. వీరికి ముగ్గురు పిల్లలు. తర్వాత ఎంతో ప్రార్థనా పూర్వకంగా, దేవుని నడిపింపుతో 1961వ సం॥లో 'ఆపరేషన్ మొబలైజేషన్'ను ప్రారంభించి ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన సేవను చేశారు. అలాగే 'లోగోస్ హోప్' అనే షిప్ ద్వారా సాహిత్య, సౌవార్తిక పరిచర్యను విరివిగా కొనసాగించారు. ఈ షిప్ ద్వారా 6,100 వ్యక్తులు 110 దేశాల్లో పనిచేస్తున్నారు.

40 సంవత్సరాలు ఆపరేషన్ మొబలైజేషన్‌కు నాయకత్వం వహించి ఆగస్ట్ 2003లో అంతర్జాతీయ నాయకత్వ బాధ్యతను పీటర్ మేడిన్‌కు అప్పగించి తన భార్య డ్రెనాతో కలిసి అనేక దేశాల్లో సువార్తను ప్రకటిస్తూ సాహిత్య పరిచర్య విస్తరించడంలో అలుపెరుగని పరిచర్యను జరిగించారు.

స్వయానా జార్జ్ మంచి రచయిత. నో టర్నింగ్ బ్యాక్, ద పాత్ ఆఫ్ క్రిస్టియన్ డిసైపుల్‌షిప్, డేంజర్ ఆఫ్ స్పిరిచ్యువల్ డిసెప్షన్, ద హౌస్ అండ్ వైస్ ఆఫ్ డిస్‌యూనిటీ, ఔట్ ఆఫ్ కంఫర్ట్‌జోన్..మొ॥.అలాగే అనేక వ్యాసాలు రచించారు. తను రాసిన పుస్తకాలలో ఒక మిలియన్ పుస్తకాలను ప్రపంచ వ్యాప్తంగా ఆంగ్లము, ఆయా భాషల్లో పంపిణీ చేశారు.

దేవుడు తనకు ఇచ్చిన ఈ ఉన్నతమైన దర్శనం, పిలుపుకోసం కడదాకా నమ్మకంగా జీవించాడు. "దేవుడు నీకు నిత్యజీవితాన్ని ఇచ్చాడు గనుక ఈ జీవితాన్ని దేవుని కొరకు ఖర్చుచెయ్యి" అని ఉద్ఘాటించడమే కాకుండా, దాన్ని తన జీవితంలో రుజువు చేశాడు. ఆత్మల భారంతో పరితపించే ఒక సామాన్యమైన వ్యక్తిని దేవుడు ఎంత గొప్పగా వాడుకొంటాడనేదానికి జార్జ్ వర్వర్ గారి జీవితమే ఒక ఉదాహరణ. 'ప్రభువు నన్ను పిలుస్తున్నాడు, నా ఆరోగ్యం కోసం ప్రార్థించకండి. నా జీవితాన్ని బట్టి ప్రభువును స్తుతించండి' అని తన చివరి సందేశాన్ని పలికిన జార్జ్ 14 ఏప్రిల్ 2023న 84సం॥ల వయసులో మహిమా ప్రవేశం చేశారు. వీరి శక్తివంతమైన జీవితం, త్యాగపూరిత సేవ మనకు ఆదర్శం, సవాలు.

– పి. రామస్వామి, దర్శి